Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.10.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 20 పేజీలు : 12, వెల : ₹ 5


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008 CERTIFIED HOSPITAL
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

లాయర్
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# పది జిల్లాలపై పగబట్టారా?



▲ మూడు జిల్లాలపై మురిపెం

▲ ఉత్తరాంధ్ర, రాయలసీమకు శాపం

రాష్ట్ర విభజన సమయంలో ప్రతి ఒక్కరి నోటా ఒక అభిప్రాయం వినిపించింది. ఇన్నేళ్లు అభివృద్ధినంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకరించారని, కాబట్టి ఈరోజు ఆ నగరాన్ని వదులుకోవాలంటే కష్టంగా వుందని! నిజమే ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పుడు ప్రతి ముఖ్యమంత్రి కూడా మిగతా రాష్ట్రం మొత్తం మీద సగం దృష్టి పెడితే ఒక్క హైదరాబాద్ మీదే సగం దృష్టి పెట్టేవాళ్లు. నిధులు కూడా అంతే. ఆ నగరానికే సింహభాగం దక్కేవి. స్వర్గీయ ఎన్టీఆర్, వై.యస్.రాజశేఖరరెడ్డిలతో పాటు నారా చంద్రబాబునాయుడులు కూడా హైదరాబాద్ అభివృద్ధిలో కీలక భాగస్వాములు.

వీళ్లకు హైదరాబాద్ పిచ్చి ఎంతగా వుందనేదానికి ఉదాహరణ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే! హైదరాబాద్‌ను వదిలిపోండని తెలంగాణవాళ్లు తరుముతున్నా కూడా చంద్రబాబు ఆ నగరాన్ని వదిలి తన సొంత రాష్ట్రానికి రాలేకపోతున్నారు. గత ప్రభుత్వాలు కేవలం హైదరాబాద్ మీదే దృష్టి పెట్టకుండా రాయలసీమ, కోస్తాంధ్రలలో కూడా ఒక్కో నగరాన్ని రాజధాని తరహాలో అభివృద్ధి చేసుంటే విభజన టైంలో హైదరాబాద్‌ను వదులుకోవడానికి అంతగా (మిగతా 11వ పేజీలో)



# కదిలించని జగన్ దీక్ష

పచ్చి దగా, పచ్చి మోసానికి ఉదాహరణ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం. విభజన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీ అది. వాళ్లు ఐదేళ్లు ఇస్తామంటే పదేళ్లు కావాలంటూ ఆనాటి ప్రతిపక్షం, ఈనాటి అధికారపక్షం బీజేపీ డిమాండ్ చేసింది కూడా! ప్రపంచంలోనే అతిపెద్ద పార్లమెంటు వ్యవస్థలో, కోట్లాదిమంది ప్రజలు చూస్తుండగా ఇచ్చిన ప్రత్యేకహోదా హామీకి ఈరోజు విలువ లేకుండా పోయింది. విభజన ద్వారా తల్లిని చంపి బిడ్డను బయటకు తీసారంటూ ఆనాడు ఏపి పట్ల ͏భూతి వ్యక్తం చేసిన నరేంద్ర మోడీ కూడా ఈరోజు దాని గురించి మాట్లాడడం లేదు. (మిగతా 11వ పేజీలో)




పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
విజయదశమి శుభాకాంక్షలు.
సం/-



# నిప్పులు కక్కుతున్న పప్పు



నిత్యావసర వస్తువులలో ప్రధాన భాగమైన పప్పుల ధరలు నిప్పులు కక్కుతున్నాయి. సాధారణంగా వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయంటారు. కాని పప్పుల ధరలు ఆకాశాన్ని దాటి ఇంకా పైకి పోయాయి. గత రెండు నెలలుగా పప్పుల ధరలు పెరగడమేగాని తగ్గడం అన్నది లేదు. కిలో కందిపప్పు రకాలను బట్టి 180, 190రూపాయలు పలుకుతోంది. మినపప్పు అయితే 170, 180రూపాయలు వుంది. పెసరపప్పు 130రూపాయలు, వేరుశెనగపప్పు 160రూపాయలు వుండగా తినే శెనగపప్పు 75రూపాయలుగా వుంది. ఉదయం అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు మన ఆహారపదార్థాలలో ఇవి కావాలి. ఇడ్లీ, దోశ, వడ, పొంగల్... సాంబారు, పప్పు... మన దైనందిన ఆహారంలో ఇవి భాగం. ఇవన్నీ కూడా పైన చెప్పిన పప్పులతో చేసేవే. పప్పుల రేట్లు నిప్పులు చెరుగుతుండడంతో హోటళ్లలో కూడా ధరలు పెంచుతున్నారు. హోటళ్లలో పప్పుకూరలు తగ్గించి ఆకు, కాయగూరలు వడ్డిస్తున్నారు. పప్పు ధరల కంటే చికెన్ ధరలు తక్కువుగా వున్నాయి. స్కిన్ చికెన్ కిలో వంద రూపాయలకే వస్తోంది. స్కిన్‌లెస్ అయితే 140రూపాయలకే లభిస్తోంది. కిలో చేపలు కూడా వంద నుండి నూటపది రూపాయలే. పప్పులు కొనడం కంటే రోజూ చేపలు, చికెన్ వండుకోవడం మేలనుకుంటున్నారు కొందరు. మాంసాహారుల సంగతి సరే! మరి శాఖాహారుల మాటేమిటి? వాళ్లు ఆకు కూరలు, కాయగూరలు చూసుకుంటున్నారు. పప్పుల ధరలు ఇకనన్నా తగ్గుతాయో, లేక ఇంకా పెరిగి గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కుతాయో చూద్దాం!

## మోడీ గారూ... హోదా ప్రకటించండి

నెల్లూరుజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని శంకుస్థాపనకు విచ్చేస్తున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ శంకుస్థాపనలో నవ్యాంధ్రకు ప్రత్యేకహోదాను ప్రకటించాలన్నారు. అడ్డగోలుగా రాష్ట్రాన్ని రెండుగా విభజించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి పోయింది. ఈ విషయాలన్నీ మీకు తెలుసు, ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఐదేళ్లు హోదా ఇస్తామంటే, కాదు పదేళ్లు ఇవ్వాలని మీ వెంకయ్యనాయుడు గారే నిండు సభలో చెప్పారు. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై వుంది. పార్టీలు పక్కనపెట్టండి. హోదా వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. మీపైన రాష్ట్ర ప్రజలు ఆశలు పెట్టుకొని వున్నారు. హోదా ఇస్తే మీరు చరిత్రలో మిగిలిపోతారు. ప్రతిపక్షాలను దృష్టిలో పెట్టుకుని కాక, ప్రజలను దృష్టిలో పెట్టుకుని హోదా ప్రకటించండి. రాష్ట్ర ప్రజలు మీకు రుణపడి వుంటారు. అనాథగా మారిన రాష్ట్రాన్ని ఆదుకోండి. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి కావాలంటే, నిరుద్యోగులకు ఉపాధి రావాలంటే, రాష్ట్రం బాగుపడాలంటే హోదాయే శరణ్యం. ఇదే నేటి నవ్యాంధ్ర ప్రజల మనోగతం. ప్రజల ఆకాంక్షను మీరు గౌరవిస్తారని ఆశిస్తున్నాం... అంటూ అరుణమ్మ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## విచిత్ర వాతావరణం

కాలుష్యంతో వాతావరణం పాడైపో తుందంటే ఏమో అనుకున్నారుగాని ఈ స్థాయిలో పాడైపోతుందనుకోలేదు. ఒకే నెలలో మనం మూడు కాలాలను చూస్తున్నాం. ఇది అక్టోబర్ నెల. వర్షాల సీజన్. కాని మే నెలను తలపించే రీతిలో ఎండలు కాస్తున్నాయి. చెమటలు కారడం ఏ మాత్రం తగ్గలేదు. ఇక అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతున్నాయి. ఇక తాజాగా తెల్లారుజామున పొగమంచు కూడా పడుతోంది. అక్టోబర్ నెలలోనే ఎండా, వానా, చలికాలాలను చూస్తున్నాం.

## ప్రాజెక్టుల కమిటీలు నియామకం

నెల్లూరుజిల్లాలోని పెన్నా, సోమశిల ప్రాజెక్టుల కమిటీసభ్యులను పార్టీ నేతలు ఎంపిక చేశారు. పెన్నార్ డెల్టా ఛైర్మెన్‌గా ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు, డైరెక్టర్లుగా ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బీద గిరిధర్, పాశం శ్రీహరిరెడ్డి, చక్కా మదన్‌మోహన్ ఎంపికయ్యారు. సోమశిల ప్రాజెక్టు ఛైర్మెన్‌గా రాపూరు సుందరరామిరెడ్డి, వైస్‌ఛైర్మెన్‌గా వంటేరు జయచంద్రారెడ్డి, డైరెక్టర్లుగా కర్లగుంట మధుబాబునాయుడు, డి.రవీంద్రనాయుడు, పులిగుంట మదన్‌మోహన్‌రెడ్డి నియమితులయ్యారు.

## అసమర్థ సిఎం వల్లే హోదా దూరం

అసమర్థ సిఎం చంద్రబాబు వల్లే రాష్ట్రానికి ప్రత్యేకహోదా దూరమైందని వైయస్సార్‌సీపీ నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నెల్లూరుజిల్లా కోటలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేకహోదా సాధించుకునే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఓటుకు నోటు కుంభకోణం నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబు ప్రత్యేకహోదాను తాకట్టుపెట్టాడన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఐదేళ్లు కాదు, తాము అధికారంలోకి వస్తే పదేళ్ల ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పి ప్రజల్ని నమ్మించిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఇప్పుడు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు ప్యాకేజీ మాటలు వట్టి బూటకమన్నారు. సమావేశంలో కోట ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# సేంద్రియ పద్ధతులే శ్రేయస్కరం

### - రైతులకు వ్యవసాయశాఖ జేడీ సూచన

వ్యవసాయంలో సేంద్రీయ పద్ధతులే ఎంతో శ్రేయస్కరమని రైతులు గుర్తించాలని, సేంద్రియ పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో పాటు, అధిక దిగుబడులు కూడా పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ జేడీ వేణుకృష్ణ అన్నారు. నెల్లూరు కొండాయపాళెం రోడ్డులో వున్న జీసెస్‌సెంటర్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులకు, రైతులకు 5 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీవి మాట్లాడుతూ, జిల్లాలో అత్యధిక శాతం వరి పంటను పండిస్తున్నారు కనుక, వరికి రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల రైతులకు పెట్టుబడి పెరగడంతో పాటు, దిగుబడి తగ్గిపోతుందని, కనుక రైతులు రసాయనిక ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. అదేవిధంగా సస్యరక్షణకు వాడే మందులు కూడా అధికంగా వాడడం వల్ల, పురుగులు నిరోధకశక్తిని పెంచుకుని ఏ మందులకూ లొంగని విధంగా తయారవుతూ పంటలకు బాగా నష్టం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం పెరిగితే రైతులకు మిత్రపురుగులు కూడా పంటపొలాల్లో అంతరించిపోయే ప్రమాదం వుందన్నారు. వ్యవసాయభూములు సారవంతం అయ్యేందుకు అంతరపంటలు వేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయభారతి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ పివి కృష్ణారెడ్డి, పుల్లంరాజు, వ్యవసాయ శాఖ ఏ.డిలు రవిచంద్రప్రసాద్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## ఉచిత దీపం

గ్యాస్ కనెక్షన్ లేని బిపిఎల్ కార్డుదారులందరికీ ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ యం.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. 1450రూపాయల డిపాజిట్‌ను, 150 రూపాయల రెగ్యులేటర్ ఖరీదును ప్రభుత్వమే భరిస్తుంది. జిల్లాకు 2015-16 సంవత్సరానికి గాను 1,64,800 దీపం కనెక్షన్‌లు మంజూరు చేసారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 41200కనెక్షన్‌లు ఇవ్వాలని నిర్ణయించాం. గ్యాస్ కనెక్షన్ లేని తెల్లరేషన్ కార్డుదారులు మీ సేవ కేంద్రంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం వివరాలతో 10రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకొని రశీదు పొందాలి. వీరికి 15రోజులలోపు గ్యాస్ ఏజన్సీ వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా పంపుతామని, కాబట్టి లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ప్రతిభా విద్యార్థినులకు అభినందనలు

ఇందుకూరుపేటలోని జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పలువురు ప్రతిభావంతులైన విద్యార్థినులను ఈ నెల 11న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మి, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి అభినందించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన శ్రావణి, సోనియారాణి, కామాక్షి, స్వాతి, మేనక, చరిత, నజ్మా, ప్రవీణలను అభినందించారు.

## రాజధానికి పోలేరమ్మ మట్టి

అమరావతి రాజధాని స్థూపం నిర్మాణంలో పవిత్రమైన వెంకటగిరి పోలేరమ్మ మట్టిని వాడనున్నారు. ఇటీవలే వెంకటగిరి పోలేరమ్మ జాతర జరిగింది. జాతర తర్వాత మట్టితో తయారు చేసిన అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేస్తుంటారు. ఈ సమయంలో అమ్మవారి ప్రతిమ మట్టిని భక్తులు తీసుకుని ఇళ్లల్లో వుంచుకుంటారు. ఈసారి అమ్మవారి మట్టిని రాజధాని స్థూపం కోసం తీసి పెట్టారు. ఆ మట్టిని రాజధానికి తరలించినట్లు తెలుస్తోంది.

## 'పంచ చాలీసామృతం' ఆవిష్కరణ



ప్రకాశం జిల్లా పామూరులోని శ్రీ సాయిబాబా భక్తబృందంవారి సౌజన్యంతో ముద్రించిన 'పంచ చాలీసామృతం' పుస్తకాన్ని ఈ నెల 11న పామూరులో ఆవిష్కరించారు. పామూరులోని సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పామూరు గ్రామంలోని దివ్యజ్ఞాన సమాజంలో ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ పచ్చిపులుసు రాధాకృష్ణమూర్తి, ఆధ్వర్యంలో ఈ అయిదు చాలీసాలను ముద్రించారు. ఇందులో శ్రీ దత్త చాలీసా, శ్రీ సాయి చాలీసా, శ్రీ వాసవీ చాలీసా, శ్రీ లలితా చాలీసా, శ్రీ హనుమాన్ చాలీసా వున్నాయి. శ్రీ వాసవీ చాలీసాను ప్రముఖ కవి బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి రచించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ప్రముఖ సారస్వతవేత్త ఇస్కపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ప్రముఖ వైద్యులు రామినేని రంగారావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభలో పాల్గొన్న ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ఈ సందర్భంగా 'వర్తమాన సాహిత్యం-తీరుతెన్నులు' అనే అంశంపై ప్రసంగించి నిర్వాహకుల నుంచి ఘనసత్కారం అందుకున్నారు. ఈ పుస్తక ముద్రణకు సహకరించిన వదాన్యులను, ముఖ్యంగా సేకరణకర్తగా కృషిచేసిన శ్రీ పచ్చిపులుసు రాధాకృష్ణమూర్తి-కరుణాదేవి దంపతులను ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. పామూరులోని శ్రీ సాయిబాబా భక్తబృందం, మిత్రమండలివారితో పాటు పలువురు సాహిత్యాభిమానులు, ఆధ్యాత్మికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సంగీత పోటీలు

సంస్కృతి తరంగాలు ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని జాతీయ స్థాయి సంగీత పోటీలను ఈ నెల 16 నుండి 18 వరకు నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్కృతి తరంగాలు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 16వ తేదీ సాయంత్రం 6గంటల నుండి 8.30గంటల వరకు మోదుమూడి సుధాకర్ అండ్ పార్టీ వారిచే శాస్త్రీయ సంగీత విభావరి జరుగుతుందన్నారు. 17వ తేదీ సాయంత్రం 6గంటల నుండి 9గంటల వరకు కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డా॥ ముప్పవరపు సింహాచలశాస్త్రిచే 'గురు గుహోదయం' హరికథాగానం జరుగుతుందన్నారు. 18వ తేదీ సాయంత్రం 6గంటల నుండి 6.30 గంటల వరకు కుమారి కాట్రగడ్డ హిమాగ్ర చౌదరిచే స్వాగతం కృష్ణ కూచిపూడి నృత్య ప్రదర్శన అనంతరం సంస్థచే గౌరవ సన్మానం జరుగుతుందన్నారు. 18వ తేదీ సాయంత్రం 6.30గంటలకు ప్రప్రథమ తెలంగాణ ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు బూమ్‌పల్లి సుధీర్‌రావుకు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7గంటలకు మధ్యప్రదేశ్ ఉజ్జయినికి చెందిన రాజశ్రీ పురాణి బృందంచే కథక్ నృత్య ప్రదర్శన జరుగుతుందని, ఈ కార్యక్రమాలకు సింహపురి కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, నరశింహారావు పాల్గొన్నారు.



• బెంగుళూరులో

# విరిసిన 'రెయిన్‌బో'

దేశంలో ప్రసిద్ధిగాంచిన వైద్య శిఖరాలలో నెల్లూరీయులెందరో వున్నారు. వారిలో ఒకరు డాక్టర్ కంచర్ల రమేష్. నెల్లూరీయులు గర్వించదగ్గ చిన్నపిల్లల వైద్యుడు. ఏ.ఎస్.పేట మండలంలోని చిరమన వాసి. ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు పొందిన గ్లోబెల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ సోదరుడు. ఇప్పటికే హైదరాబాద్, చెన్నై వంటి నగరాలలో రెయిన్‌బో చిన్నపిల్లల ఆసుపత్రులను నెలకొల్పి ఎందరో చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్న డాక్టర్ రమేష్ తాజాగా తమ సేవలను బెంగుళూరుకు కూడా విస్తరించారు. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో 200 పడకలతో, అత్యంత అధునాతన వైద్య విభాగాలతో బెంగుళూరులోని మార్తహల్లి ప్రాంతంలో నెలకొల్పిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఈ నెల 11వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి యం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో రెయిన్‌బో హాస్పిటల్స్ దేశానికే తలమానికం కావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలకు ప్రతిరూపమైన చిన్నారులకు మెరుగైన సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కర్నాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఎమర్జెన్సీ విభాగం, పీడియాట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్, రేడియోలజీ విభాగాలను ప్రారంభించగా, కర్నాటక వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి యు.టి.ఖాదర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు పి.సి.మోహన్, శాసనసభ్యులు అరవింద్ లింబవల్లి, జాతీయ పరీక్షా కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిపిన్‌బాద్రాలతో పాటు బెంగుళూరులోని ప్రముఖులు, పెద్దసంఖ్యలో వైద్యులు, రమేష్ మిత్రులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్ తమ హాస్పిటల్‌కు సంబంధించి మాట్లాడుతూ 90కోట్ల ఖర్చుతో అడ్వాన్స్‌డ్ వైద్య పరిజ్ఞానంతో ఈ ఆసుపత్రిని



నెలకొల్పామన్నారు. 15ఏళ్లకు పైగా అనుభవమున్న వైద్య సిబ్బందితో సేవలు అందిస్తున్నామన్నారు. బెంగుళూరుకు చుట్టుపక్కల 200 కిలోమీటర్ల పరిధి వరకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నాము. పురిటిబిడ్డల కోసం 35శాతం పడకలను వుంచుతున్నాము. 24గంటలూ వైద్యసేవలు అందుతాయి. న్యూరాలజీ, నెఫ్రాలజీ, గాస్ట్రో ఎంట్రాలజీ, హేమటాలజీ, అంకాలజీ, ఎండోక్రైనాలజీ వంటి విభాగాలలో నిపుణులైన వైద్యులు సేవలందిస్తారు. ఏ సమయంలో ఎటువంటి పరిస్థితుల్లో వచ్చినా చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని రమేష్ తెలిపారు. చిన్నారి లోకానికి కానుకగా ఓ వైద్యసంస్థను బెంగుళూరీయులకు అందించిన రమేష్‌కు 'లాయర్' అభినందనలు.



# బాధ్యతలు తీసుకున్న రామిరెడ్డి



జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బి.రామిరెడ్డి ఈ నెల 15వ తేదీన నెల్లూరు జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఇఓగా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. జడ్పీ అధికారులు, సిబ్బంది కొత్త సిఇఓను కలిసి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిఇఓ రామిరెడ్డి జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి కూడా తన మిత్రుడు రామిరెడ్డికి అభినందలు తెలిపారు.

# దోమలపై యుద్ధం ప్రకటించిన అనిల్

నెల్లూరు నగరంలో దోమల అంతానికి పంతం పట్టిన నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, ఆ దిశగా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. బుధవారం నెల్లూరు 41వ డివిజన్ పరిధిలోని మన్సూర్‌నగర్ మురికి కాలువల్లో దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్ వదిలారు. అలాగే నగరంలోని అన్ని ప్రాంతాల్లో తన అనుచరుల ద్వారా మురికి కాలువల్లో, మురికిగుంటల్లో ఆయిల్‌బాల్స్ వదిలే కార్యక్రమాలు చేయిస్తూ దోమల నిర్మూలనకు తన వంతు కృషి చేస్తున్నారు.




శుభారంభం

అందరికి ఇదే మా ఆహ్వానం



Dr. M.V. RAMA MOHAN
M.D(Gen. Med), D.M(Endocrinology).
ENDOCRINOLOGIST & DIABETOLOGIST

Diabetes & Endocrine Clinic

డయాబిటిస్ & ఎండోక్రైన్ క్లినిక్

16/2/219, పొగతోట, నెల్లూరు - 524 001.
0861- 2320232, 2326892, 8106337020
అక్టోబర్ 22, 2015 గురువారం ఉదయం 9.00గంటల నుండి ప్రారంభం
declinic.in



Dr. S. SATYANARAYANA MURTHY
B.Sc., M.B.B.S., D.DIAB, (Yugoslavia)
SPECIALIST IN DIABETES


- నెల్లూరులో మొట్టమొదటి సూపర్ స్పెషాలిటీ డయాబెటిస్ మరియు హార్మోన్ కేర్ సెంటర్
- షుగరు మరియు షుగరు సంబంధించిన అన్ని సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం మరియు బరువు తగ్గుట, అవాంఛిత రోమాలు, నెలసరి సమస్యలు, PCOS, వంధత్వము(Infertility), జననాంగాల సమస్యలు, ఎముకల సమస్యలు(Osteoporosis), పిట్యుటరి సమస్యలు, హైబిపి, మొదలగు హార్మోన్ సమస్యలకు సూపర్ స్పెషాలిటి వైద్యం.

State of Art Technology - Facilities available:

ROCHE COBAS C 311 Biochemistry | ROCHE COBAS E 411 Hormone Analyzer | Retina Photography | Vascular Doppler | 12 Channel ECG | CGMS Insulin Pump | FOOT CARE

# 'ప్రభా'తం

## ఆవు ఆత్మక(వ్య)థ



ఈ దేశంలో పులిని చంపితే నేరం. నెమలిని చంపితే నేరం. జింకను చంపితే నేరం. కాని వీటికున్న హక్కు కోట్లాదిమంది ప్రజలు పూజించే గోమాతకు లేకుండా పోతోంది. దేశంలో నెలకొన్న ఓట్ల రాజకీయ చదరంగంలో ఈ మూగజీవం బలిపశువుగా మారుతోంది. మనకు పాలిచ్చిన పాపానికి ప్రాణాలే కోల్పోతోంది.

ఈ దేశంలో వందేమాతరం పాడకుంటేనే లౌకిక భావం వర్ధిల్లినట్లు... ఈ దేశంలో ఎంఎఫ్ హుస్సేన్ గీసిన సరస్వతీదేవి నగ్న చిత్రాలను చూసి చప్పట్లు కొడితేనే లౌకిక రాజ్యం వున్నట్లు... ఈ దేశంలో ప్రతి నిముషం హిందూ విశ్వాసాలను దెబ్బ తీస్తుంటే లౌకికత్వం విరాజిల్లుతున్నట్లు. ఈ దేశంలో ఆవులను తెగనరుకుతుంటేనే లౌకికతత్వాన్ని కాపాడుతున్నట్లు? వందేమాతర గీతానికి లౌకిక భావానికి సంబంధమేంటి? ఆవులను వధించడానికి లౌకిక సిద్ధాంతాలకు సంబంధమేంటి? దీనిని ఎవరన్నా ప్రశ్నిస్తే వాళ్లంతా మతతత్వవాదులు. ఈ పోకడలను సమర్థించిన వాళ్లు మాత్రం మేధావులు.

గత కొన్ని వారాలుగా దేశవ్యాప్తంగా కూడా గోవధ అనేది ఒక హాట్ టాపిక్‌గా వుంది. రాజకీయాలలోనూ ఇది సెగలు పుట్టిస్తోంది. బీహార్ ఎన్నికల్లో అయితే దీని ప్రభావం బలంగానే వుండబోతోంది. గోవధ అంశం మీదనే రాజకీయపార్టీలు, నాయకులు, మేధావులు, మొత్తంగా ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం గోవధ నిషేధాన్ని సమర్థిస్తుంటే, ఇంకో వర్గం వ్యతిరేకిస్తోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దాద్రి అనే గ్రామంలో జరిగిన ఓ దారుణంతో గోవధ తెరమీదకొచ్చింది. ఆవు మాంసం వుంచుకున్నాడనే అనుమానంతో మహ్మద్ ఇఖ్లక్ అనే వ్యక్తిని స్థానికులు దారుణంగా చంపారు. ఇది అందరూ ఖండించదగిన సంఘటన. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు స్పందించాలి కూడా! హతుడి కుమారుడు ఆర్మీలోనే పని చేస్తున్నాడు. ఈ సంఘటనతోనే గోవధ అంశం రాజకీయ ప్రచారాంశంగా మారిపోయింది. పూజ్య బాపూజీ కూడా గోవధ నిషేధం కోరుకున్నాడు. కాని ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీయే నీరు గారుస్తూ వచ్చింది.

గోవు హిందువులకు పవిత్ర జంతువు. గోపూజ హిందూ సంస్కృతిలో భాగం. గోహత్య మహాపాతకం అనే దానిని ఎక్కువమంది ప్రజలు విశ్వసిస్తారు. సృష్టిలో ఆక్సిజన్‌ను పీల్చి ఆక్సిజన్‌ను వదిలే ఏకైక జంతువు ఆవు. ఇది ఇచ్చే పాలను మొదలుకొని, పేడ, మూత్రం వంటి వన్నింటికి ప్రత్యేకత వుంది. ఆయుర్వేద మందులలో సైతం ఆవుపాల ఉత్పత్తులకు, మూత్రానికి ప్రాధాన్యత వుంది. ఇక హిందూ పురాణాలలోనూ, చరిత్రలోనూ ఆవుకు దేవుడి స్థానమిచ్చివున్నారు. భారతదేశంలో అనాదిగా కూడా గోపూజ వుంది. మతపరంగా గోవుకు వున్న స్థానం ఇది. కాబట్టి మెజార్టీ ప్రజల విశ్వాసాలను గౌరవించడం కూడా ప్రభుత్వాలు, పాలకుల ధర్మం. మైనార్టీ ప్రజలు తమ సోదరవర్గాల్ల విశ్వాసాలను గౌరవిస్తూ, తమ మనోభావాలను కాపాడుకోవాలి.

గోవధపై ప్రస్తుతం జరుగుతున్న రచ్చ విషయంలో రాజకీయాలను పక్కన పెడదాం. మత విశ్వాసాలను అటకెక్కిద్దాం. ఏ మతం ఏం చెప్పిందో మనకు అనవసరం. కేవలం ఇప్పుడు భూమ్మీదవున్న పరిస్థితులను మాత్రమే పరిగణనలోకి తీసుకుందాం. కొంచెం మానవత్వంతో, కొంచెం పర్యావరణ దృష్టితో, ఇంకొంచెం ఉపాధి మార్గంలో ఆలోచిద్దాం. ఆవులను మేపుకుంటూ పాడి ఉత్పత్తులను పెంచుకుంటూ పాల వ్యాపారం చేసుకుంటే మనిషికి లాభమా? లేక కోసుకుని తింటే లాభమా? ఈ దేశంలో ఆవును తినాల్సిన పరిస్థితులున్నాయా? ఆహార పంటలు లేని కొన్ని దేశాలలో జంతువులనే ఆహారంగా తీసుకుంటారు. అక్కడ తప్పదు. వాటిని తినకపోతే అక్కడి మనుషులు బ్రతకలేరు. కాని భారతదేశంలో ఆ పరిస్థితి లేదే! సమృద్ధిగా పంటలు పండుతున్నాయి. మాంసాహారులకు చేపలు, కోళ్లు, పొట్టేళ్లు వంటివి అందుబాటులో వుంటున్నాయి. అలాంటప్పుడు కోట్లాదిమంది ప్రజలు పవిత్రంగా పూజించే ఆవును చంపాల్సిన అవసరమేముంది? ఆవునొక్కదానినే ఎందుకు చంపకూడదు? మిగతా జంతువులు, జీవరాశి పవిత్రం కాదా అని ప్రశ్నించే వితండమేధావులు ఈ దేశంలో లేకపోలేదు. ఈ సృష్టిలో ఎవరి మహిమో చెప్పలేంగాని మనుషులను శాఖాహారులుగా, మాంసాహారులుగా విభజించి మంచి పనే చేసారు. మనుషులంతా శాఖాహారులైతే భూమి నిండా కోళ్లు మేకలు, పొట్టేళ్లు, ఇతర జంతువులతో నిండిపోయేది. ఇక సముద్రాలు చేపలతో నిండిపోయి, అవి అక్కడే చనిపోయి కాలుష్యం ఏర్పడి భూమికే ముప్పు ఏర్పడేది. సముద్రంలో ఉత్పత్తి అవుతున్న చేపలను ఎప్పటికప్పుడు తింటుండబట్టి సముద్రాలు అలాగే వుంటున్నాయి. మనుషులు పూర్తిగా శాఖాహారులైనా ప్రమాదమే. ఎందుకంటే శాఖాహార పదార్థాల ధరలు ఇప్పుడున్న వాటికంటే నాలుగింతల పెరిగుండేవి. అదీగాక వాటి లభ్యత కూడా తక్కువగా ఉండేది. చేపలు, కోళ్లు వంటివాటి పునరుత్పత్తి ఎక్కువ. ఈ జీవులు అంతరించే ప్రమాదముండదు. కాని ఆవు పునరుత్పత్తి తక్కువ. ఒక ఈతలో ఒక దూడకే జన్మనిస్తుంది. ప్రతిరోజూ వేలసంఖ్యలో ఆవులను కబేళాలకు తరలించి వధిస్తుంటే, భవిష్యత్‌లో మన తర్వాత తరాల వారు వాటిని పాఠ్యపుస్తకాలలో బొమ్మల రూపంలో చూడాల్సి వస్తుంది. ఇప్పుడు డైనోసార్ల మీద సినిమాలు వస్తున్నట్లే, భవిష్యత్‌లో ఆవుల మీద కూడా సినిమాలు తీయాల్సి వస్తుంది. ఈ దేశంలో పులిని చంపితే నేరం. నెమలిని చంపితే నేరం. జింకను చంపితే నేరం. కాని వీటికున్న హక్కు కోట్లాదిమంది ప్రజలు పూజించే గోమాతకు లేకుండా పోతోంది. దేశంలో నెలకొన్న ఓట్ల రాజకీయ చదరంగంలో ఈ మూగజీవం బలిపశువుగా మారుతోంది. మనకు పాలిచ్చిన పాపానికి ప్రాణాలే కోల్పోతోంది. గోవులను వధించడమే ఈ దేశ లౌకికవాదానికి చిహ్నమని భావించే మేధావుల్లారా... ఇప్పటికైనా వాస్తవ దృష్టితో ఆలోచించండి. ఆవును తింటేనే మనం బ్రతకలేం... ఆవు పాలతో మనం బ్రతకగలం. పాలు లేక ఎన్నో దేశాలలో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. సమయానికి తల్లిపాలు లేకపోతే ఆవు పాలే పసిబిడ్డలకు ఆహారం. ఆ పాలిచ్చే గోవులే లేకపోతే ఈ పసిబిడ్డలేం కావాలి. ఆవును మతం కోణంలో నుండి చూడడం మాని మానవీయ కోణంలో చూడండి!

## దేహ సమర్పణ



నెల్లూరు వనంతోపు సెంటర్‌కు చెందిన మార్గరెట్ నార్సిస్(73) మృతి చెందడంతో ఆమె దేహాన్ని పినాకిని దేహసమర్పణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణ వైద్య కళాశాల మానవ శరీర నిర్మాణ శాస్త్ర విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా పినాకిని సంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబసభ్యుల సమ్మతితో మోడరన్ ఆసుపత్రికి నేత్రాలు దానం చేయడంతో పాటు వైద్యకళాశాలకు దేహాన్ని అందించామన్నారు. వైద్యకళాశాలకు దేహాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సేవలు పునఃప్రారంభించాలి

భారతరత్న డా॥ బిఆర్ అంబేద్కర్ పేరు మీద ఆంధ్ర రాష్ట్రంలో 1983లో ఓపెన్ యూనివర్సిటీని ప్రారంభించడం జరిగిందని, గత సంవత్సరం నుండి యూనివర్సిటీలో ఎటువంటి సేవలు జరుగకపోగా, పిజి, డిగ్రీ కోర్సులు పాసైన వారికి ఇప్పటివరకు సర్టిఫికెట్లు రానందు వల్ల ఇబ్బందులకు గురౌతున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఏపి దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## ఆకట్టుకున్న కేతా అంకుల్ వార్షికోత్సవం



నెల్లూరులోని సాంస్కృతిక సంస్థ కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్టు 27వ వార్షికోత్సవం ఇటీవల టౌన్‌హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి యనమల నాగేశ్వరరావు యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కావలి మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ, ఏపి మేదర సంఘం అధ్యక్షులు యల్లాల బాబును సంస్థ తరఫున సత్కరించారు. హైటెక్ మెజీషియన్ ఎ.కె.రాయలు ఇంద్రజాల ప్రదర్శన, శ్రీ బాలాజీ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షులు కేతా సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## మెర్సీ మార్గరెట్‌కు 'పెరసం' పురస్కారం



హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి మెర్సీ మార్గరెట్‌కు నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) వారి సాహిత్య పురస్కారం లభించింది. ఆమె రచించిన 'మాటల మడుగు' పుస్తకానికి ఆ మేరకు అవార్డును బహుకరించారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరిగిన పెరసం వార్షికోత్సవ వేడుకల్లో ఆ పురస్కారాన్ని మెర్సీమార్గరెట్‌కు ప్రదానం చేశారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద, పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోహూరు పెంచలనరసింహం, కార్యదర్శి సుభద్రాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, కవులు శ్రీధర్‌బాబు, షంషుద్దీన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఇదేం రాజధాని

చంద్రబాబు ఒక రాజధానిని కడుతున్నాడో, లేక ఒక కొత్త దేశాన్నే నిర్మిస్తున్నాడో అర్థం కావడం లేదు. రాజధాని శంకుస్థాపనకే ఇంత బిల్డప్ అవసరమా? శంకుస్థాపనను ఎంతో సాదాసీదాగా చేసి, చంద్రబాబు తాను కలగన్న రాజధానిని నిర్మించాక భారీఎత్తున ప్రారంభోత్సవం జరిపి వుండాలి. కాని ముందుగానే ఈ హంగామా ఎందుకు? రేపు అక్కడ ఏమీ కట్టకపోతే పరువుపోదా?

**ఎస్.సాయిప్రసాద్, కావలి.**

## సక్రమంగా లేని పన్నులు

నెల్లూరు నగరంలో ఏళ్ల తరబడి వేలాది నివాస స్థలాలు ఖాళీగా వున్నాయి. వీటికి వేకెంట్ టాక్స్ కట్టాలి. మార్కెట్ విలువ ఆధారంగా ఖాళీ స్థలాలకు 0.20శాతం నుండి 0.50శాతం వరకు పన్నులు విధించాలని మున్సిపాల్టీలకు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఖాళీ స్థలాల యజమానులు ఇంటి నిర్మాణానికి వచ్చినప్పుడు వేకెంట్ లాండ్ టాక్స్ కట్టి వుంటేనే ఇంటి ప్లాన్‌కు అనుమతినివ్వాలి. నగరంలో చాలా ఖాళీస్థలాలు యజమానుల నిర్లక్ష్యం మూలంగా అపరిశుభ్రంగా వుంటూ అల్లరి మూకలకు అడ్డాగా మారుతున్నాయి. కాబట్టి వేకెంట్‌లాండ్స్ పన్నులపై కార్పొరేషన్ అధికారులు దృష్టి పెట్టాలి.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## అసంతృప్తిగా వైద్య సేవలు

మన దేశంలో, మన రాష్ట్రంలో వైద్యసేవలు, వాటి నిర్వహణ సంతృప్తికరంగా లేవు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు ధనార్జనే ప్రధాన ధ్యేయంగా వుంటోంది. వైద్యసేవలను ఇతర సేవలతో పోల్చి డబ్బు సంపాదనపై దృష్టి పెట్టడం చింతించాల్సిన విషయం. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందని కాలంలో వైద్యులు సేవా దృక్పథంతో మెరుగైన వైద్యసేవలందించారు. ఇప్పుడు వైద్యం దోపిడీగా మారింది. ప్రభుత్వ వైద్యశాలల నిర్వహణ లోపభూయిష్టం కావడంతో ప్రైవేట్ వైద్యశాలల దోపిడీ ఎక్కువైంది. ఇతర రాష్ట్రాలలో కంటే ఆంధ్రప్రదేశ్‌లో వైద్యసేవలు ఘోరంగా ఉంటున్నాయి.

**ఆర్.ఎస్.నాథ్, నెల్లూరు.**

## ఎద్దు ఈనింది!

'ఎద్దు ఈనింది' అన్నాడట ఒక తిక్క శంకరయ్య! గాట కట్టెయ్యండి అన్నాడట మతిలేని మల్లయ్య! అలా ఉంది గోదావరి కృష్ణ అనుసంధానం. గోదావరి కొల్లేరు సరస్సుగా దర్శనమివ్వగానే ఉమాభారతి చంద్రబాబును అభినందించడం, తెలుగు తమ్ముళ్లు బాబును అపర భగీరథుడని పొగడటం!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# వాళ్ల బ్రతుకేంటి? భవిష్యత్ ఏంటి?

**భారతదేశంలో రేషన్‌కార్డులకు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి సబ్సిడీ పథకాలకు తప్ప జీవనోపాధికి ప్రభుత్వాల మీద ఆధార పడడం చాలాతక్కువ. ప్రభుత్వ ఉద్యోగాలు స్వల్పంగా వుంటాయి. ఇటీవల ప్రైవేటీకరణ జోరుతో వున్న అరకొర ప్రభుత్వ ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. రిక్షా తొక్కడం నుండి టీకొట్టు మొదలుకొని పెద్దపెద్ద వ్యాపారాల వరకు స్వయం ఉపాధి కల్పించుకోవడానికే ప్రజలు శ్రమ పడుతుంటారు. ప్రభుత్వాన్ని నమ్ముకోకుండా తమ బ్రతుకు మార్గాన్ని తామే వెతుక్కుంటుంటారు. అది చిన్న పనయినా, పెద్దపనయినా సొంతంగా చూసుకుంటుంటారు. కాబట్టే సర్కార్ కొలువులు లేక పోయినా తమ బ్రతుకు బండిని ఏదో విధంగా నెట్టుకొస్తుంటారు.**

జేబులు కొట్టడం, ఖూనీలు చేయడం, వ్యభిచారం వంటి అసాంఘిక పనులు కాకుండా ప్రజలకు సర్వీస్ చేస్తూ నాలుగు రూపాయలు సంపాదించుకునే ఏ పనినైనా మనం స్వాగతించాల్సిందే! ఈరోజు



నెల్లూరు నగరంలో దాదాపు 20వేలమంది ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నగరంలో ఆటోల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందే! అయితే ట్రాఫిక్‌ను సరిదిద్దుకోవాలేగాని ట్రాఫిక్ లేకుండా చేయాలని ఆటోలను నిషేధిస్తే... ఈ 20వేల మంది బ్రతుకులేం కావాలి? భవిష్యత్ ఏం కావాలి? జీవనోపాధి కోల్పోయి వాళ్లల్లో కొందరైనా నేరస్థులుగా మారితే దానికి బాధ్యులెవరు?

నెల్లూరులోని జిల్లా రవాణా కార్యాలయం వద్ద కూడా ఇదే పరిస్థితి. ఏజంట్లయితేనేమీ, ఆర్టీవో ఆఫీసు వద్ద చిన్నచిన్న దుకాణాలు పెట్టుకున్న వాళ్లయితేనేమీ దాదాపు 400మంది దాకా ఆర్టీవో ఆఫీసును నమ్ముకుని గత కొన్నేళ్లుగా జీవిస్తున్నారు. వీరిలో ఏజంట్లున్నారు, టిఫిన్ అంగడి, టీకొట్టు, జెరాక్స్ షాపు, కూల్‌డ్రింక్స్ షాపు, మజ్జిగ బండి, సోడా బండి, వేరుశెనక్కాయలు అమ్ముకునే వాళ్లు... ఇలా చాలామంది బ్రతుకు వెళ్లదీస్తున్నారు. అంటే ఈ లెక్కన నాలుగు వందల కుటుంబాల దాకా బ్రతుకుతున్నట్లే! వాహనదారులను తప్పుదోవ పట్టించే ఏజంట్లపై చర్యలు తీసుకో వాల్సిందే! అయితే కొందరు వాహనదారులే తమ పనులను ఏజంట్ల ద్వారా చేయించుకుంటుంటారు. వాళ్లు చేసిన సర్వీసుకు తమకిష్టమైనంత ఇచ్చు కుంటుంటారు. ఇది ఎప్పటి నుండో జరుగుతున్న తంతు. వాహనదారులు గాని ఫిర్యాదులు చేస్తే అప్పుడు ఏజంట్లపై చర్యలు తీసుకుని వుంటే బాగుండేది. కాని రవాణాశాఖాధికారులు ఉన్నఫళంగా ఏజంట్లపై విరుచుకు పడ్డారు. ఏజంట్లను లోపలకు రానీయకుండా కట్టడి చేయడమేకాక ఆర్టీఓ ఆఫీసు బయట వున్న దుకాణాలన్నింటిని మూయించారు. దీని వల్ల ఆ దుకాణాలు పెట్టుకుని బ్రతుకును వెళ్లదీస్తున్న వారంతా రోడ్డున పడ్డారు. సరే, ఏజంట్లు ప్రమేయం లేకుండా చేసారు... ఆర్టీవో ఆఫీసు సిబ్బంది మెరుగైన సేవలం దిస్తూ వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చూస్తున్నారా అంటే అదీ లేదు. గతంలోకంటే ఇబ్బందులు ఇంకాస్త ఎక్కువయ్యాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# డీలర్లు ప'రేషన్'



## • ఈ పాస్‌తో కొత్త తిప్పలు

***చౌకదుకాణాల డీలర్... ఒకప్పుడు బ్రతుకు దెరువుగా వుండేది. ఇప్పుడు అదొక ఆదాయ వనరు అయ్యింది. పద్ధతిగా నిబంధనల ప్రకారం పని చేస్తే రేషన్‌డీలర్‌కు నెలకొచ్చే సరికి పెద్దగా మిగిలేదేమీ వుండదు. అయితే అసలు ఆదాయం వుండేది మిగిలిన సరుకులను బ్లాక్ మార్కెట్‌కు పంపించడంలోనే!***

చౌకదుకాణాల ద్వారా ప్రజావసరాల నిమిత్తం ప్రభుత్వం ఏడాదికి వేలకోట్ల సబ్సిడీ ఇస్తూ ప్రజలకు పంపిస్తున్న రేషన్ బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమలలో పెద్దఎత్తున అవినీతి జరుగుతున్న విషయం లోకవిదితమే. ఈ సరుకులపై ప్రభుత్వం ఇస్తున్న సగం సబ్సిడీ దండగే. కాని ఏ ప్రభుత్వం వచ్చినా చౌకదుకాణాల ద్వారా సరుకులు అందించడం ఒక బలహీనతగా మారింది. కాబట్టి చౌకదుకాణాల ద్వారా సరుకులను ఆపలేము. రేషన్ డీలర్లకు ఇదొక వరంగా మారింది. సరుకుల పంపిణీ మీద వచ్చే కమీషన్ కంటే కూడా మిగిలిన సరుకులను బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువైంది. దీంతో రేషన్ డీలరుకు డిమాండ్ ఎక్కువైంది.


ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ముందుగా గురిపెట్టేది రేషన్ డీలర్ల మీదే! అంతకుముందున్న డీలర్లను తీసేసి కొత్తగా తమ పార్టీ వాళ్లకు డీలర్‌షిప్‌లు ఇచ్చుకుంటుంటారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ముందు చేసింది అంతకుముందున్న డీలర్లను తీసేయడమే. చాలావరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నియమించిన డీలర్లను తీసేసి తెలుగుదేశం అనుకూలురకు డీలర్‌షిప్‌లు ఇచ్చారు. ఇంతవరకు బాగానే వుంది. అయితే చంద్రబాబు తన అద్భుథ మేధాశక్తితో రూపొందించిన ఈ పాస్ విధానం డీలర్లకు శాపంగా మారింది. డీలర్లు మొదట ఈపాస్ విధానం తమ పాలిట వరమనుకున్నారు. చంద్రబాబు అనే దేవుడు తమకు ఇచ్చిన అవకాశమనుకున్నారు. తీరాచూస్తే అదే వారి పాలిట గుదిబండ అయ్యింది. అదెలాగంటే...

రేషన్ షాపులో ఈ–పాస్ యంత్రాలను ఏర్పాటు చేయడం తెలిసిందే! లబ్దిదారుడు వేలిముద్ర సరిపోతేనే సరుకులు ఇచ్చేవాళ్లు. ఈపాస్ యంత్రాలలో వున్న లోపాల వల్ల వేలిముద్రలు సరిపోక చాలామంది లబ్దిదారులు నెలవారీగా సరుకులు తీసుకోలేక పోయారు. ఇలా ప్రతి నెలా వందల టన్నుల్లో బియ్యం, చక్కెర నిల్వలు మిగిలిపోయాయి. ప్రతి నెల ప్రతి డీలర్ సరుకులకు ఇండెంట్ పెట్టాలి. ఉదాహరణకు ఒక నెలలో 10టన్నుల బియ్యం, ఒక టన్ను చక్కెర ఇవ్వాలనుకుందాం. ఈపాస్ నిబంధనల వల్ల అయితేనేం, కొందరు తీసుకోకపోవడం వల్లనైతేనేమీ 6టన్నుల బియ్యం, అరటన్ను చక్కెర పంపిణీ కాగా నాలుగు టన్నుల బియ్యం, అరటన్ను

(మిగతా 11వ పేజీలో)

• నెల్లూరులో

# పర్యాటకానికి ప్రాణం!



నెల్లూరుజిల్లాలో చెప్పుకోదగ్గ పర్యాటక ప్రాంతాలకు కొదువలేదు. కాని వాటి గురించి ఈ జిల్లాలో వుండే వాళ్లకే చాలామందికి తెలియదు. జిల్లాలో 180కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతముంది. ఈ జిల్లాలో పుట్టి పెరిగిన చాలామంది ఈ తీరానికి వెళ్లి సముద్రాన్ని చూసి వుండరు. ఇలాంటి సముద్రాన్ని చూడడానికి గోవాకో, పట్టాయకో పోతుంటారు. నెల్లూరులో ఇంటిముందున్న రంగ నాయకులస్వామి దేవస్థానానికి ఎప్పుడూ పోనివాళ్లు టూరిజం పేరుతో తమిళనాడులోని శ్రీరంగంకు వెళుతుంటారు. జిల్లాలో వున్న కండ్లేరు ఉప్పునీటి కాలువ ఎంత పెద్దదో చాలామందికి తెలియదు. సముద్రపు ఆటుపోట్ల వల్ల ఏర్పడింది ఈ కాలువ. కొన్ని చోట్ల గోదావరి కంటే వెడల్పుగా వుంటుంది. ఈ కండ్లేరు ఆధారంగానే కృష్ణపట్నం పోర్టును నిర్మించారు. ఈ క్రీక్‌లో పడవలో ప్రయాణిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. కాని మనోళ్లకు ఈ క్రీక్ గొప్పతనం తెలియదు. పడవల్లో ఎక్కి ప్రయాణించడానికి కేరళకు పోతుంటారు. పెంచలకోన వద్ద జలపాతం వుందన్న సంగతి చాలామందికి తెలియదు. జలపాతాలను చూడడానికి కర్నాటకకు పోతుంటారు. జిల్లాలో ఆధ్యాత్మికంగా, ప్రకృతి పరంగా పర్యాటక కేంద్రాలు చాలానే వున్నాయి. నేలపట్టు, పులికాట్, మైపాడు, కొత్తకోడూరు, తూపిలిపాలెం బీచ్‌లు, ఉదయగిరి కొండ, కండ్లేరు, సోమశిల డ్యాంలు, పెంచలకోన, చెంగాళమ్మ, నరసింహకొండ, జొన్నవాడ వంటి ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రాలు చాలానే వున్నాయి. చాలాకాలంగా జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధిపై మాటలు చెబుతున్నారేగాని ఆచరణ దాల్చడం లేదు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. నెల్లూరు జిల్లాను ఈ ప్రాజెక్ట్‌లో చేర్చేందుకు జిల్లా కలెక్టర్ యం.జానకి కేంద్రానికి ప్రతిపాదనలు పంపి వున్నారు. ఈ ప్రాజెక్ట్ ఓకే అయితే జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి ఊతమొస్తుంది. ఓ పక్క జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. పర్యాటకరంగం కూడా అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. జిల్లావాడైన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు పూనుకుంటే స్వదేశీదర్శన్ ప్రాజెక్ట్‌లో నెల్లూరుజిల్లాను చేర్చడం పెద్ద సమస్య కాదు.




ప్రథమ వర్ధంతి

పూజ్యులు, మాకు మార్గదర్శకులు,
మా అభివృద్ధికి కారకులు, దైవసమానులు
శ్రీ గునుపాటి పరంధామరెడ్డి గారు
(అధినేత, జిపిఆర్ గ్రాండ్ కళ్యాణ మండపం)
పరమపదించి తేది 15-10-2015 నాటికి
యేడాది గడిచిన సందర్భంగా
వారి పవిత్రాత్మకు
శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య - గునుపాటి విజయలక్ష్మి

కుమారుడు - కోడలు
జి.వి.కృష్ణారెడ్డి - ప్రశాంతి

కుమార్తె - అల్లుడు
పోచారెడ్డి ఝాన్సీ - రామ్‌మోహన్‌రెడ్డి

మనుమలు - మనుమరాళ్లు
గీతాకృష్ణసాయి, మోహిత్ కృష్ణ, వాసు, నేహాప్రియ

# నెల్లూరు కబుర్లు

## శంకుస్థాపనకు నెల్లూరు తమ్ముళ్ళు

ఈ నెల 22వ తేదీన దసరా రోజు గుంటూరుజిల్లా అమరావతి వద్ద జరిగే రాజధాని శంకుస్థాపనలో పాల్గొనేందుకు నెల్లూరుజిల్లా తెలుగుదేశంపార్టీ నేతలు సమాయత్తమవుతున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీలోని కీలకమైన నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కూడా తరలి వెళ్లనున్నారు. దీని కోసం భారీగా వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు పిలుపు మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల నుండి మట్టి, నీళ్లు కూడా సేకరిస్తున్నారు.

## ఉత్తేజంగా 5కె రన్



మానసికోల్లాసం, ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో 'గోగ్రీన్' అనే సందేశంతో నెల్లూరులో ఆదివారం నిర్వహించిన నెల్లూరు 5కె రన్ ఉత్తేజంగా, ఉల్లాసంగా సాగింది. ఈ పరుగును జిల్లా కలెక్టర్ యం.జానకి జెండా వూపి ప్రారంభించారు. ఏసి స్టేడియం నుండి ప్రారంభమైన ఈ పరుగు వేదాయపాలెం నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు, అక్కడ నుండి తిరిగి ఏసి స్టేడియం వరకు సాగింది. జిల్లాలోని పలువురు ఈ పరుగులో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణపట్నంపోర్టు సిఇఓ అనిల్‌కుమార్, డిఎస్డీవో యతిరాజ్, దొడ్ల డెయిరీ ఛైర్మెన్ దొడ్ల శేషారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు 5కె రన్ నిర్వాహకులు డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ సుధాకేశవరాజు మాట్లాడుతూ ప్రజల్లో పరుగు సంస్కృతిని ప్రోత్సహించేందుకు గాను ఆర్ఎఫ్ఐడి చిప్‌తో రన్‌ను నిర్వహించామన్నారు. చిప్‌తో వ్యక్తిగత పరుగు సమయాన్ని ఖచ్చితంగా నమోదు చేసేందుకు వీలుంటుందన్నారు. వార్షిక కార్యక్రమంగా ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. వచ్చే యేడాది నెల్లూరులో 10కే రన్‌ను చేపడతామన్నారు. వివిధ విభాగాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలును ఆర్గనైజర్లు అందజేశారు.

## అపోలోలో కీళ్ల వ్యాధులకు అధునాతన వైద్యం



నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో కీళ్ల వ్యాధులకు అధునాతన వైద్యాన్ని అందిస్తున్నట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 12వ తేదీ ప్రపంచ కీళ్ల వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 10వ తేదీ విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి, ఎక్సైర్‌సైజ్‌ల ద్వారా కీళ్లు, మోకాలి నొప్పులను 90శాతం మందికి తగ్గిస్తున్నామని, మిగిలిన 10శాతం మందికి ఆపరేషన్ చేసి మోకాలి చిప్పను మారుస్తున్నామన్నారు. అపోలోలో 162మందికి కీళ్ల మార్పిడి చేసినట్లు వివరించారు. అపోలో యూనిట్‌హెడ్ విష్ణువర్ధన్, డాక్టర్లు వివేకానందరెడ్డి, ఆనంద్, మీరావలి పాల్గొన్నారు.



## 24నుంచి రొట్టెల పండుగ

నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గా రొట్టెలపండుగ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. 24వ తేదీ షహదత్‌తో పండుగ ప్రారంభమవుతుందని, 25న గంధ మహోత్సవం, 26న రొట్టెల పండుగ, 27న తహలీల్ ఫాతెహాతో పండుగ ముగుస్తుందన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## దసరా రద్దీ

విజయదశమి సెలవుల నేపథ్యంలో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. దసరా సెలవులు రావడంతో విద్యార్థులు స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో బస్సులు రద్దీగా నడుస్తున్నాయి. బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు నడిచే అన్ని ఏసి, సూపర్‌లగ్జరీ బస్సులలో రాను, పోను ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ అయితే దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ల ధరలు పెంచుతున్నాయి. ట్రైన్‌లలో రిజర్వేషన్లు దొరకడం గగనంగా మారింది.

## గుడిలో రాజకీయం

దసరా ఉత్సవాల సందర్భంగా నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వేసిన దసరా ఉత్సవాల నిర్వహణ కమిటి విషయంలో టిడిపి, బీజేపీ నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. స్థానిక కార్పొరేటర్ రాజానాయుడు ఆధ్వర్యంలో ఈ కమిటీని వేసారు. ఈ కమిటీలో తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని బీజేపీ వాళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు.

### కొన్ని మూసారు...
## కొన్ని తెరిచారు

జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 12 నుండి దసరా సెలవులు ప్రకటించారు. అయితే ప్రభుత్వ బడులు తప్పితే ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం 13, 14 తేదీలలో కూడా నడవసాగాయి. ఈ నెల 12వ తేదీన డిఇఓ ఆంజనేయులు నగరంలో పర్యటించి, తెరచివున్న ప్రైవేట్ స్కూళ్లను మూయించారు. అయితే కొన్ని స్కూళ్లు తెరచివున్నా విద్యాశాఖాధికారులు ఆ స్కూళ్లను మూయించలేకపోవడంతో విమర్శలకు గురయ్యారు.

## విశ్వసాయి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



నెల్లూరు విశ్వసాయి కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2015 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రతిభా అవార్డులు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో సైన్స్‌లో 19మందికి ప్రతిభా అవార్డులు ప్రకటించగా అందులో 6మంది విశ్వసాయి విద్యార్థులు కావడం గమనార్హం.

ఈ విద్యార్థుల్లో కె.యశ్వంత్ న్యూఢిల్లీలోని ఏఐఐఎంఎస్‌లో ఎంబిబిఎస్‌లో చేరి నెల్లూరు ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాడు. డి.హర్షితారెడ్డి, పి.మేఘనారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీలలో యంబిబిఎస్‌లో చేరారు. ఈ అవార్డు బహుకరించేటప్పుడు ప్రశంసాపత్రంతో పాటు రూ.20వేలు నగదును ఇస్తారని, గత సంవత్సరం ఈ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహుకరించారని విశ్వసాయి సంస్థల ఛైర్మెన్ డా॥ ఎన్.సత్యనారాయణ తెలిపారు.

### • అక్టోబర్ 31న
## జవహర్‌భారతి పూర్వవిద్యార్థుల సమావేశం

కావలిలోని జవహర్‌భారతి కళాశాలలో 1976-78 ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు ఈ నెల 31న నెల్లూరు నగరంలో సమావేశం కానున్నారని, ఈ సమావేశం ముఖ్యసమన్వయకర్త, ఎస్.ఎస్ డయాగ్నోస్టిక్స్ అధినేత డాక్టర్ వి.రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం అనంతరం పూర్వ విద్యార్థులు కావలిలో వున్న కళాశాలను కూడా సందర్శిస్తారన్నారు. 1976-78 ఎంపీసీ, బైపిసి ఇంటర్మీడియట్, జవహర్‌భారతి పూర్వ విద్యార్థులు సమావేశ పూర్తి వివరాల కోసం 94402 75021 నెంబర్‌లో తనను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.


## యూత్‌కాంగ్రెస్ నిరసనలు




మాజీప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల పోస్టల్ స్టాంపులు తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి మరియు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మి రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో విడివిడిగా హెడ్‌పోస్టాఫీసు ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఇందిరా, రాజీవ్ ఫోటోలతో వున్న స్టాంపులను పునరుద్ధరించాలని కోరుతూ వారు హెడ్‌పోస్టాఫీసు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందిర, రాజీవ్‌లు దేశం కోసం ప్రాణాలర్పించారని, ఇలాంటి త్యాగధనులను విస్మరించడం శోచనీయమని కేతంరెడ్డి వినోద్‌రెడ్డి పేర్కొన్నారు.

## శబరి శ్రీరామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామ క్షేత్రంలో శని త్రయోదశిని పురస్కరించుకుని ఈ నెల 10వ తేది విశేషపూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల భావనాచార్యుల పర్యవేక్షణలో శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు పాల్గొని సామూహికంగా పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ సి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, మేనేజర్లు కట్టా చంద్రారెడ్డి, డి. సుబ్బరాయుడురాజు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.


## బాబా వారి మహా సమాధి, విజయదశమి మహోత్సవములు

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

తేది. 22-10-2015 గురువారం నుండి 24-10-2015 శనివారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు జరుగును.

తదుపరి మధ్యాహ్నం 12గంటల నుండి అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/- చెల్లించి తగిన రశీదు పొంది బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము. పై దినములలో ప్రతిరోజు సా॥ 7.00గం.లకు సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయి బాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.



గుర్రపు డెక్కతో నిండిపోయిన పంటకాలువ

• పూడిపోతున్న పంటకాలువలు

# విజృంభిస్తున్న అంటువ్యాధులు

## • నగరం నరకంగా మారిపోతున్నా.. పట్టించుకోని అధికారులు

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, 'నీరు చెట్టు' వంటి పథకాలను ప్రవేశపెట్టి, ఆ పథకాలు సక్రమంగా అమలు చేయాలని, ఎక్కడా దుర్గంధపూరిత వాతావరణం లేకుండా పరిశుభ్రతతో వుండాలని నిత్యం మొత్తుకుంటూనే వున్నా, జిల్లా అధికారుల్లో కానీ, నగరంలోని అధికారుల్లో కానీ ఏమాత్రం చలనం వుండడం లేదు.**

నెల్లూరు నగరం మురుగుగబ్బుతో నిండిపోతున్నా, వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, దోమలు ప్రబలుతున్నా అటు జిల్లా ఉన్నతాధికారులు కానీ, ఇటు నగరపాలక సంస్థ కానీ పట్టించుకోకపోవడం పట్ల పౌరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, నగరంలోని పలు పంటకాలువలు మురుగుకాలువలుగా మారిపోయి, ఆ చెంతనే నివాసాలున్నవారు నిత్యం దుర్గంధం భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. సర్వేపల్లికాలువ చెత్తాచెదారంతో, వ్యర్థ పదార్థాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా ఈ కాలువ పరమదుర్గంధ భూయిష్టంగా వుంది. అధికారులు ఈ కాలువపై వున్న బ్రిడ్జిల మీదనే కారుల్లో ప్రయాణీలు సాగిస్తుంటారు కానీ, ఈ కాలువ దుస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదు. పంటపొలాలకు సాగునీటిని తీసుకువెళ్ళే ఈ కాలువ, నెల్లూరుకో డ్రైనేజీ కాలువగా మారిపోయింది. ఇదేవిధంగా కొన్ని పంటకాలువలు గుర్రపుడెక్కతో నిండిపోతే, మరికొన్ని మురుగుతో నిండిపోయి వున్నాయి. సైడు కాలువలు, డ్రైనేజీ కాలువల దుస్థితి మాటల్లో వర్ణించలేనంత దుర్గంధంతో నిండివున్నాయి. మురుగునీటి పారుదలకు సక్రమమైన వసతులు కల్పించలేకపోవడం, నెలలు, సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తూనే వుండడంతో ఈ పరిస్థితి దాపురించింది. చిన్న వాన వస్తే చాలు, మురుగుతో నిండివున్న సైడు కాలువలన్నీ ప్రధాన రోడ్లమీదికి వచ్చి అడుగు పెట్టాలంటేనే వళ్ళు జుగుప్స కలిగించేవిధంగా, ఎంత రోతగా వున్నా భరించాల్సిందే తప్ప ఎవరూ ఈ మురుగు నివారణకు చర్యలు తీసుకోలేకపోతుండడం నెల్లూరు దౌర్భాగ్యం. అండర్‌బ్రిడ్జిల వద్ద నీటిమడుగులు నిండిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా, ముందుచూపుతో మురుగునీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. ఎక్కడ చూసినా మురుగు పేరుకుపోతోంది. ఈ మురుగుతో, ఈ దోమలతో అంటురోగాలు ప్రబలి బీదా బిక్కీ, మధ్యతరగతి ప్రజలు నిత్యం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా ఎవరికి వారు మౌనమే అన్ని సమస్యలకీ పరిష్కారం అన్నట్లుగా నిర్లిప్తంగా వుంటున్నారే తప్ప, ప్రజావసరాలను కానీ, ప్రజారోగ్యాన్ని కానీ పట్టించుకోవడం లేదంటూ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛభారత్, నీరుచెట్టు, ఆరోగ్యం-పరిశుభ్రత వంటివన్నీ మాటలకు, ప్రకటనల ఆర్భాటాలకూ పనికివస్తున్నాయే తప్ప, ఆచరణలోకి రావడం లేదు. నెల్లూరును సుందర నందనవనంగా తీర్చిదిద్దుతామని పాలకులు, అధికారులు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూనే వున్నా, ఆ మాటలు ఆచరణలోకి రావడం లేదు. ఈ పరిస్థితి అంతా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసిందే అయినా, ఈ సమస్యను దాటవేస్తూ పోవడం, వున్న పథకాలను సద్వినియోగం చేసుకోకుండా కాలయాపన చేస్తూ పోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు.

స్వచ్ఛభారత్, నీరు చెట్టు వంటి పథకాలకు నిధులు-విధులు వున్నా అవి కూడా నామమాత్రంగానే జరుగుతుండడం ప్రజలకు మరింత వేదన కలిగిస్తోంది. నగరంలోని పంటకాలువలు మురుగుకాలువలై, దోమల ఉత్పత్తికేంద్రాలై నానా రకాల వ్యాధులకు గురిచేస్తున్నా కూడా సంబంధిత అధికారయంత్రాంగం అటువైపే కన్నెత్తి చూడకపోవడంతో ఆయా ప్రాంతాల్లో వున్న ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు అందరూ కలసి నగరంలో ఈ మురుగు నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది. జిల్లా ఉన్నతాధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు అందరూ కలసి ఒక సంయుక్త కార్యాచరణ పథకాన్ని అమలు చేస్తే తప్ప ఈ మురుగు దిబ్బల పరిస్థితి ఒక కొలిక్కి రాదు. ఈ లోగానే, ఈ వర్షాకాలంలో నగరం ఓ అతిపెద్ద మురుగుగుంటగా మారే ప్రమాదం వుంది. వర్షపునీరు రోడ్లపై కాలువలై ప్రవహించకుండా అధికారులు తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. సైడు కాలువలు, డ్రైనేజీ కాలువల పూడిక తీయించడంతో పాటు, నగరంలోని పంటకాలువలను పూడిక తీయించి, పరిశుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా, అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. మురుగు గుంటల్లో, సైడుకాలువల్లో దోమలు ప్రబలకుండా వెంటనే మందులు చల్లించాలి. వీధుల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు ఎత్తివేస్తూ, నగరం పరిశుభ్రంగా వుండేలా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయులకు శిక్షణ అభినందనీయం




ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం చాలా అభినందించవలసిన అంశమని, 40% విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారని, మంచి ప్రతిభావంతులు వీటి ద్వారా తయారౌతున్నారని జిల్లా విద్యాశాఖాధికారి డి.ఆంజనేయులు తెలిపారు. నెల్లూరు మోడరన్ స్కూల్లో నెల్లూరుజిల్లాలోని నెపస్మా సభ్య పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతి వరకు బోధన చేసే ఉపాధ్యాయులకు నెల్లూరు జిల్లా ప్రైవేట్‌స్కూల్స్ యాజమాన్యాల అసోసియేషన్(నెపస్మా) ఏర్పాటు చేసిన 2రోజుల శిక్షణా కార్యక్రమంలో 14వ తేదీన ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు చక్కటి విజ్ఞానాన్ని అందించాలని కోరారు. విద్యార్థులను శిక్షించకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన చేయాలన్నారు. కార్యక్రమానికి నెపస్మా జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి అధ్యక్షత వహించిగా, 'అపస్మా' రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశిక్షణా సంస్థ కో-ఆర్డినేటర్ యమ్.సువర్ణ వినాయక్, నెపస్మా జిల్లా కార్యదర్శి వై.వెంకట్రామయ్య, జిల్లా ట్రెజరర్ వై.మల్లిఖార్జునరెడ్డి, యన్.శ్రీధర్, పి.వి.కృష్ణారావు, రవికుమార్, పి.శంకర్ పాల్గొన్నారు.

# 23 నుంచి ఉధృతంగా ఆందోళన

### - సిపిఐ నేత రామకృష్ణ




ఈ నెల 22వ తేదీలోగా ప్రత్యేకహోదాపై ప్రకటన రాకుంటే, 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని పప్పులవీధిలో నిర్వహించిన సభలో సిపిఐ నేత రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయాన్ని ముఖ్యమంత్రి గాలికి వదిలేసి ప్యాకేజీలకే మొగ్గుచూపుతుండడం దారుణమని, ప్రత్యేకహోదా విషయంలో కేంద్రంలోని బిజెపితో కలసి, టిడిపి కుట్రపన్నుతోందని ఆయన ఆరోపించారు. విభజన సమయంలో ప్రత్యేకహోదా పదేళ్ళపాటు వుండాలని కోరిన వెంకయ్యనాయుడు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. దేశప్రజలు ఎంతో ఉన్నతంగా భావించే పార్లమెంట్‌లో ఇచ్చిన మాటలకే విలువ ఇవ్వకపోవడం విచారకరమన్నారు. జగన్ దీక్షపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ప్రకటన విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హరనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# గీతామయి వృద్ధాశ్రమానికి వాషింగ్‌మిషన్




నెల్లూరు బాలాజీనగర్‌లో వున్న గీతామయి వృద్ధుల ఆశ్రమానికి విజయలక్ష్మి మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత యం.సత్యనారాయణ, ఆయన సతీమణి రమాదేవి ఈ నెల 10న సామ్‌సంగ్ వాషింగ్‌మిషన్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గీతామయి వృద్ధుల ఆశ్రమం వారు చేస్తున్న సేవలను గుర్తించి ఈ వాషింగ్‌మిషన్‌ను ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడు కృష్ణచైతన్య ఇచ్చినట్లు తెలిపారు. వృద్ధాప్యంలో బట్టలు ఉతుక్కోవడం కష్టం కాబట్టి వాషింగ్‌మిషన్‌ను అంద జేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

# జెడ్పీ వాకర్స్ స్వచ్ఛభారత్



నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ స్కూలు ఆవరణంలో ఆదివారం జెడ్పీ వాకర్స్ సంఘం కార్యదర్శి మండవ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఆవరణంలోని చెత్తాచెదారాలను తీసివేసి గుంతలు పూడ్చారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వాకర్స్ సంఘం ఉపాధ్యక్షులు రమణయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రాజు, ఆంజనేయులు, జెయస్‌ఆర్ ఆంజనేయులు, వియస్ ప్రసాద్, సుబ్బరాయుడు, తిరుపాల్‌రెడ్డి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్: 2322016, 2345676.

41వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవ సమాహ్వానము

తేది 13-10-2015 నుండి తేది 23-10-2015 వరకు

మహాభిషేకం తేది 22-10-2015 వేకువన 4-00 గంటలకు

ఉత్సవ కార్యక్రమములు

తేది.13-10-15 మంగళవారము శ్రీ చండీ అలంకారము
తేది.14-10-15 బుధవారము శ్రీ భవాని అలంకారము
తేది.15-10-15 గురువారము శ్రీ గాయత్రి అలంకారము
తేది.16-10-15 శుక్రవారము శ్రీ అన్నపూర్ణ అలంకారము
తేది.17-10-15 శనివారము శ్రీ గజలక్ష్మి అలంకారము
తేది.18-10-15 ఆదివారము శ్రీ కాళిక అలంకారము
తేది.19-10-15 సోమవారము శ్రీ సరస్వతీ అలంకారము
తేది.20-10-15 మంగళవారము శ్రీ మహాలక్ష్మి అలంకారము
తేది.21-10-15 బుధవారము శ్రీ దుర్గా అలంకారము
శ్రీ మహిషాసుర మర్ధిని
తేది.22-10-15 గురువారము శ్రీ రాజరాజేశ్వరి అలంకారం
శమిపూజ, పారువేట, నగరోత్సవం
తేది.23-10-15 శుక్రవారము మధ్యాహ్నం 12గంటలకు
శ్రీ అమ్మవారి సన్నిధిలో అన్నదానం

శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవముల ఆలయ ప్రధానార్చకులు శ్రీ తంగిరాల రాధాకృష్ణ శర్మ, అర్చకులు మరియు సిబ్బంది యొక్క సహాయసహకారములతో నిర్వహించబడుతున్నవి.

రత్నం జయరామ్
వ్యవస్థాపక ధర్మకర్త

పి.కోదండరామిరెడ్డి
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి



ఇటీవల గూడూరు ప్రాంతీయ వైద్యశాలలోని రోగుల బాధలు అడిగి తెలుసుకుంటున్న నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి, ప్రక్కన సబ్‌కలెక్టర్ గిరీషా, డాక్టర్ రాజా

## ప్రతి ఒక్కరూ ఒక మొక్కని నాటాలి



మొక్కలు నాటుతున్న కనుమూరు హరిచంద్రారెడ్డి, మునిగిరీష్, ప్రతినిధులు

ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటితే గూడూరు పట్టణం సుందరవనంగా మారుతుందని హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కనుమూరు హరిచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం షుమారు 70చెట్లను నాటి ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డులో మొక్కలను నాటి పెంచే ప్రక్రియను బాధ్యతగా తీసుకుంటామని, దీనికి పట్టణ ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు కె.మునిగిరీష్, మునిభాస్కర్, వెంకట్రావు, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రత్యేకహోదా ఉద్యమం ఆగదు



సమావేశంలో మాట్లాడుతున్న సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కేంద్ర, రాష్ట్ర నాయకుల కుటిల యత్నాలతో విడిపోయిన రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించేవరకు ఉద్యమం ఆగదని వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగన్ దీక్షకు సంఘీభావంగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యాన 10వ తేదీ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రస్తుతం సిఎం కేవలం అమరావతికే పరిమితమై రాజధాని పేరుతో నమ్మించి రైతుల నుంచి పొలాలు తీసుకొని వ్యాపారం చేస్తున్నట్లు విమర్శించారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో వెంకయ్యనాయుడు హోదా తెస్తాం, పరిశ్రమలు తెస్తాం అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. హోదా కోసం ప్రజలు సైతం కలసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నాశిన నాగులు, వాటంబేటి శివకుమార్, మల్లు విజయకుమార్‌రెడ్డి, మధు, శ్రీనివాసులురెడ్డి, మధుసూధన్‌రెడ్డి, భాస్కర్, పి.నాగరాజు, మురళి పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## చేగువేరా యువతకు ఆదర్శం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన

ప్రపంచంలో పీడిత ప్రజల విముక్తికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన చేగువేరా యువతకు ఆదర్శవంతుడని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. చేగువేరా 48వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల చేగువేరా ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు ఎం.సురేష్‌బాబు ఆధ్వర్యాన విద్యార్థులకు క్రీడా సామాగ్రిని 50మందికి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఛైర్‌పర్సన్ దేవసేనను ఆ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిబాబు, సివిఆర్ కుమార్, కౌన్సిలర్ మస్తానమ్మ, గుండాల ఆదినారాయణ, హరిప్రసాద్, రఫి, శ్యాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి చేయూత

ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ఆదుకునేందుకు సహృదయంతో ముందుకు రావడం అభినందనీయమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. నెల్లూరుకు చెందిన విజయకుమార్ అనే వ్యక్తి ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని స్వాంతన సేవా సమితి అధ్యక్షుడు విజయకుమార్ సేకరించిన రూ.20వేలను బాధితుడు బంధువులకు ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా ఆదివారం అందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మరో రూ.5వేలును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కాంతి, హరి, సుబ్బు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.






## కాన్షీరామ్ 9వ వర్ధంతి సభ



కాన్షీరామ్‌కు నివాళులర్పిస్తున్న బహుజన సంఘాల సమన్వయ కమిటి సభ్యులు

గూడూరు గడియారపు స్థంభం వద్ద 9వ తేదీ కాన్షీరామ్ 9వ వర్ధంతి సందర్భంగా ఆయనకు బహుజన సంఘాల సమన్వయ కమిటి వారు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్షీరామ్ భారత రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుని భారతదేశంలో ఉన్న అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఉన్న నాడే వారు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఆయన మరణానంతరం భారత రాజకీయ సామాజిక ఉద్యమంలో ఒక ధృవతారగా నిలిచి అంబేద్కర్ తర్వాత వర్ణ వ్యవస్థకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఏకైక వ్యక్తి కాన్షీరాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్, ప్రచార కార్యదర్శి ఎమ్మార్పీఎస్ మందా కృష్ణయ్య, అణగారిన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉడతా శరత్‌యాదవ్, ప్రజాసంఘాల నాయకులు ఎల్.వి.సుబ్బయ్య తదితర బహుజన సంఘాల సమన్వయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### మోడేగుంట వెంకయ్య



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ అధినేత ఎం.సుబ్రహ్మణ్యం తండ్రిగారైన మోడేగుంట వెంకయ్య ఈ నెల 10వ తేదీన అనారోగ్యంతో కన్నుమూసారు. ఆయన వయసు 84సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కోవూరు మండలం ఇనమడుగు స్వగ్రామం. గ్రామంలో సౌమ్యుడిగా, స్నేహశీలిగా పేరుంది. చాలా ఏళ్ల పాటూ గోల్డ్‌స్మిత్‌గా పనిచేసి తన బిడ్డల ఉన్నతికి పాటుపడ్డారు. వెంకయ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జగన్ దీక్ష భగ్నానికి సినిమా యాక్టర్లు

గల్పిక

అది గుంటూరు... ప్రత్యేకహోదా కోసం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, దీక్షాయోధ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నిరాహారదీక్ష చేస్తున్న వేదిక. జగన్‌తో పాటు వై.యస్.విజయమ్మ, అంబటి రాంబాబు, ఆర్.కె.రోజా, వడ్డే శోభనాద్రీశ్వరరావు వంటి నాయకులంతా కూర్చుని వున్నారు. అప్పుడే వైద్యులు వచ్చారు. జగన్‌కు బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరో రోజు దీక్ష చేస్తున్నా కూడా జగన్‌లో బి.పి, షుగర్ నార్మల్‌గానే వున్నాయని, ఇంకో ఆరురోజుల దాకా ఇబ్బంది లేదని డాక్టర్ పసుపు నాగలింగం చెప్పాడు. ఆ మాట వినగానే అంబటి రాంబాబు తోక తొక్కిన నాగుపాములా లేచి... మీకసలు బుద్ధుందా... బి.పి, షుగర్ నార్మల్‌గా వున్నా కూడా మీరు మాత్రం వాటి లెవల్స్ పడిపోతున్నాయని చెప్పాలి, నార్మల్‌గా ఉన్నాయంటే ఆ జగన్ ఇంకా మొండిగా కూర్చుంటాడు. ఆయనదేం పోతుంది, దీక్షలు చేయడం ఆయనకు సరదా, మాకే ఇక్కడ ఉండలేక తడారిపోతోంది అని అరిచాడు. జగన్ జోక్యం చేసుకుని... ఓపిక ఉన్నవాళ్లు ఇక్కడ ఉండండి, లేనోళ్లు వెళ్లండి, నేను మాత్రం ప్రత్యేకహోదా ఇచ్చే దాకా ఇక్కడ నుండి కదిలేదు లేదు అని ఖచ్చితంగా చెప్పాడు. రోజా వుండి... రోజుల తరబడి ఇక్కడే వుండాలంటే అందరికీ బోర్‌గా వుంటుంది, కాబట్టి ఇక్కడే ఏదన్నా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుందాం... మనమే పాటలు పాడుకుంటూ, నాటకా లేసుకుంటూ దీక్షను హుషారుగా ముందుకు తీసుకెళదామని ప్రతిపాదించింది. అందరూ దానికి సరేనన్నారు.

★★★★★

విజయవాడ కృష్ణానది తీరంలో ఏపి ముఖ్యమంత్రి హైటెక్‌రత్న చంద్రబాబు క్యాంప్ కార్యాలయం. మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, రావెళ్ల కిషోర్‌బాబు, పల్లె రఘునాథరెడ్డి, యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, పీతల సుజాత, ఎంపీలు సుజనాచౌదరి, సీఎం రమేష్‌లతో సమావేశమయ్యారు. 22న మన రాజధాని శంకుస్థాపన అదిరి పోవాలి. వందకుపైగా విమానాలొస్తున్నాయి. మన రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టులు చాలకపోతే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలోని ఎయిర్‌పోర్టులను కూడా వాడుకుందాం. రాజధానికి భూములిచ్చిన రైతులందరికీ పట్టుచీరలు, పంచెలు పెట్టి శంకుస్థాపనకు పిలవండి. ఎందుకంటే భూములు పోగొట్టుకున్నవాళ్లకు చివరకు మిగిలేది ఇవే. దేశంలో వున్న అన్ని హెలికాప్టర్‌లను తెప్పించండి... మన శంకుస్థాపన చూసి ప్రధాని నరేంద్రమోడీ అసూయపడాలి. కడితే ఇలాంటి రాజధానే కట్టాలని ప్రతి ముఖ్యమంత్రి అనుకోవాలి అని అంటుండగా... మధ్యలో పి.నారాయణ జోక్యం చేసుకుని... నిజంగానే రాజధాని కడుతున్నామా? అని ఆశ్చర్యంగా అడిగాడు. వెంటనే చంద్రబాబు... కడతామో లేదో తెలియదు, కాని మన రాజధాని శంకుస్థాపన మాత్రం చరిత్రలో నిలిచిపోయేటట్లుండాలని అన్నాడు. వెంటనే దేవినేని ఉమ వుండి... ఇది తర్వాత సంగతి, ముందు ఆ జగన్ సంగతి చూడండి, అతను గుంటూరులోనే నిరాహారదీక్ష చేస్తున్నాడు. శంకుస్థాపన రోజుకు కూడా ఆయన దీక్ష చేస్తుంటే, మన శంకుస్థాపన కంటే అతని దీక్షే హైలెట్ అవుతుంది. శంకుస్థాపనకు వచ్చిన వాళ్లలో ఎక్కువమంది అతనిని పరామర్శించడానికి వెళ్లే ప్రమాదముందన్నాడు. పత్తిపాటి పుల్లారావు అందుకుని... ఆ జగన్ ఇంకో వారం దాకా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరాహారదీక్ష చేసేటట్లున్నాడు. నాకు డౌటు... అతను బాత్రూంకు వెళ్లినప్పుడల్లా అక్కడ ఏదో తింటున్నట్లున్నాడు. నీ అనుమానం తగలెయ్యా, ఎంత ఆకలయితే మాత్రం బాత్రూంలో ఎవరు తింటారని యనమల రామకృష్ణుడు అన్నాడు. ఇప్పుడు ఆ అనవసర టాపిక్ ఎందుకు, ముందు జగన్‌ను దీక్షలో నుండి లేపే ఆలోచన చేయండి, పోలీసుల చేత లేపితే సానుభూతి వస్తుంది, కాబట్టి అతని అంతట అతనే దీక్ష నుండి లేచేలా ఉపాయం ఆలోచించండని చంద్రబాబు చెప్పాడు. సార్, ఈ పనులకైతే మన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కరెక్ట్ అని కె.ఇ.కృష్ణమూర్తి సలహా ఇచ్చాడు. చంద్రబాబు ఓకే అంటూ సోమిరెడ్డికి ఫోన్ కలపమని పి.ఎస్‌ను ఆదేశించాడు.

★★★★★

జగన్ దీక్షా శిబిరం. జగన్‌తో సహా అక్కడున్న వారంతా ముఖాలు వేలాడేసుకుని వున్నారు. జగన్ దీక్షలో ఉండటంతో అక్కడుంటున్న వారు కూడా ఏమీ తినడం లేదు. అంతలో అక్కడకు ఒక వ్యాన్ వచ్చింది. అందులో నుండి సోమిరెడ్డి, నారాయణ, పుల్లారావు, పోలంరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణలతో పాటు నెల్లూరులోని హోటల్ రియాజ్ బృందం కూడా దిగింది. అప్పటికప్పుడే రియాజ్ అతని మనుషులు అక్కడ కట్టెలపొయ్యి ఏర్పాటు చేసి మటన్‌బిర్యానీ వండడం మొదలుపెట్టారు. మసాలా ఘాటు దీక్షా శిబిరంలో వున్న వారి ముక్కులను తాకసాగింది. అంబటి రాంబాబు, ఇంకొందరు నాయకుల నోళ్లల్లో నీళ్లు వూరసాగాయి. ఈ టైంలో పోలీసులొచ్చి జగన్‌ను తీసుకుపోతే బాగుండని మనసులో అనుకోసాగారు. జగన్ మాత్రం బిరియాని వాసనకు చలించలేదు. ఆ తర్వాత సోమిరెడ్డి చేపలపులుసు చేయించాడు. కాని జగన్‌లో చలనం లేదు. జగన్ దీక్ష భగ్నానికి ఇంకేం చేయాలా.. అని సోమిరెడ్డి ఆలోచిస్తుండగా పోలంరెడ్డి వెంటనే... నాదొక ఐడియా అన్నా, అన్నగారి 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమా చూసే వుంటావు, ఆ సినిమాలో విశ్వామిత్రుడి దీక్షను భగ్నం చేయడానికి ఇంద్రుడు మేనకను పంపిస్తాడు. అలాంటి ప్రయోగం మనం కూడా చేద్దామా అని అడిగాడు. రంభ, ఊర్వశి, మేనకలను మనమెక్కడ తీసుకురాగలమని సోమిరెడ్డి అన్నాడు. వెంటనే పార్టీ అధికారప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ వుండి... అంతకుమించిన అందగత్తెలు ఇక్కడే వున్నారు. కాజల్‌అగర్వాల్, తమన్నా, అమీజాక్సన్, నయనతార, హంసానందిని... వాళ్లను పిలిపించి డ్యాన్స్ చేయిద్దాం, అయితే జగన్ దీక్ష భగ్నమవుతుంది, లేదంటే మన కళ్లతోనన్నా వాళ్లను చూసినట్లుంటుందన్నాడు. సరేనని చెప్పి సోమిరెడ్డి కాజల్, తమన్నా, దీపికాపదుకొనేలను పిలిపించాడు. జగన్ ముందు వాళ్ల చేత నాట్యం చేయించాడు. అయినా జగన్‌లో చలనం లేదు. సోమిరెడ్డి నిరాశ చెందాడు. ఎలా చేయాలి, ఏం చేయాలి... దీక్షను భగ్నం చేయకుంటే చంద్రబాబు వద్ద నా ప్రిస్టేజీ ఏం కావాలంటూ తనలో తానే మదనపడసాగాడు. అలా బాధపడుతుండగానే అతని మెదడులోకి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే రాజకీయాలను పక్కనపెట్టి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+)కు ఫోన్ చేసాడు. జగన్ దీక్షను భగ్నం చేయడానికి ఓ మంచి కన్నింగ్ ఐడియా చెప్పమన్నాడు. కాజల్, తమన్నాలను తీసుకొచ్చి జగన్‌ను లేపలేరు. ఎందుకంటే అతనికి నరాల బలహీనత లేదు. ఎలాగూ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, అనంతపురం జిల్లాలో ఒకేసారి వందమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఒక నకిలీ వార్తను సృష్టించి, దీక్షా శిబిరం వద్ద వదలండి... ఆత్మహత్య చేసుకున్న వ్యక్తుల కుటుంబాలను ఓదార్చాలంటే జగన్‌కు భలే సరదా... ఒకేసారి వంద కుటుంబాలను ఓదార్చే ఛాన్స్ దొరికిందంటే ఇక అతను బలవంతంగా కూర్చోబెట్టినా కూర్చోడు... 'ఓదార్పు... ఇది జగనన్న ఓదార్పు' అంటూ పరుగెడతాడు. ముందు ఆ పని చేయండి, జగన్ అక్కడ నుండి లేవడం ఖాయం అని వివేకా చెప్పాడు. వివేకాకు థ్యాంక్స్ చెప్పి సోమిరెడ్డి ఇక పనైపోయినట్లేనన్న ధీమాతో ప్లాన్ అమలుకు బయలుదేరాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువర్గంతో విభేదాలు, పేచీలు ఏర్పడవచ్చును. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. అనుకున్న పనులు నిదానంగా జరగడం, శరీరానికి శ్రమ ఎక్కువగా ఉంటుంది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు చేజారి పోవడం, ఆర్థిక లావాదేవీలందు సమస్యలేర్పడటం, రాబడి ఆశించినంత లభించకపోవడం జరుగుతుంది. అగ్రిమెంట్లు, వ్యాపార లావాదేవీలందు మొగమాటాలొద్దు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ ఆర్థిక సమస్యలు సర్దుబాటు కాగలవు. దూరము నుండి ఆహ్వానాలు అందుకొనడం, ప్రయాణాలుంటాయి. చిన్నచిన్న వృత్తుల వారికి, వ్యాపార వర్గాల వారికి ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడటం మంచిది. అప్పగించిన పనులను సమర్థవంతంగా జరుపుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం మానడం మంచిది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపారాభివృద్ధికి ఆదాయం వృద్ధికి చేసే శ్రమ ఫలించకపోవచ్చును. పనుల వ్యాపకాల వల్ల మనస్థిమిత ముండదు. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తపడండి. మీ నిర్ణయాలు, పనులు వాయిదా పడటం మంచిది. వ్యాపార, పరిశ్రమ యాజమాన్యాలు ప్రభుత్వం, అధికారుల వల్ల ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నది. చదువుపై శ్రద్ధ తగ్గుతుంది. కోర్టు కేసులు వాయిదాపడతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

రియల్ ఎస్టేట్, మార్కెటింగ్ రంగాలలో అమ్మకాలు పెరుగుతాయి. షేర్ మార్కెట్ కొద్దిపాటి లాభాలు తెచ్చి పెడుతుంది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారవర్గాల వారికి ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. ఒకటి రెండు ముఖ్యపనులు అప్రయత్నంగా నెరవేరగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సమర్థవంతంగా శుభకార్యాలు జరపడం ఉంటుంది. కుటుంబ సమేతంగా ప్రయాణాలుంటాయి. వారం మధ్యలో మీ కార్యక్రమాలు హడావిడిగా పూర్తి చేస్తారు. సాంకేతిక, శాస్త్ర, అధ్యాపక వర్గాల వారు మంచి ప్రతిభను కనుబరుస్తారు. ఆర్థికాభివృద్ధికి మీ పథకాలు, ఆలోచనలు కార్యరూపం ధరించి ఆదాయాన్ని పెంచుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు అనుకూలం.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

క్రొత్తగా ఇంటికి సౌకర్యాలు అమర్చుకొనడం జరుగుతుంది. ఆర్థిక లావాదేవీలందు అనుకూలత, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. వ్యాపారవర్గాలకు ఆర్థిక సమస్యలు కొంత సర్దుబాటై, ఆదాయం పెరుగుతుంది. కుటుంబసభ్యుల అనుకూలత సరిగా ఉండదు. మీ ఆలోచనలు కుటుంబ వ్యక్తుల ఆలోచనలు వేరుగా ఉంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 16.10.2015 నుండి
తేది. 22.10.2015 వరకు

ఈ వారంలో మీనంలో కేతువు, సింహంలో కుజ గురు శుక్రులు, కన్యలో రవిబుధ రాహువులు, వృశ్చికంలో శని, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు, 17తేది వరకు సింహంలో రవి, 18తేది నుండి కన్యరాశిలో రవి సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 19 సోమవారము సరస్వతీపూజ, తేది 20 మంగళవారము దుర్గాష్టమి, తేది 21 బుధవారము మహర్నవమి, తేది 22 గురువారము విజయదశమి.

### ముహూర్తములు

తేది 22 గురువారము ఉదయం గంట 10.36 నుండి గంట 12.46లోగా గృహారంభ, వ్యాపార, అక్షరాభ్యాస, అన్నప్రాశనలు ధనుర్లగ్నము.

తేది 23 శుక్రవారం రాత్రి గంట 9.33 నుండి గంట 11.42లోగా వివాహ గృహప్రవేశాలు మిధున లగ్నము.

### ఆశ్వయుజ మాస శుక్లపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | తదియ | ఉ॥ గం.9.03వ॥ |
| తేది. 17 | శని | చతుర్థి | ఉ॥ గం.9.58వ॥ |
| తేది. 18 | ఆది | పంచమి | ఉ॥ గం.10.20వ॥ |
| తేది. 19 | సోమ | షష్ఠి | ఉ॥ గం.10.14వ॥ |
| తేది. 20 | మంగళ | సప్తమి | ఉ॥ గం.9.36వ॥ |
| తేది. 21 | బుధ | అష్టమి | ఉ॥ గం.8.32వ॥ |
| తేది. 22 | గురు | నవమి | ఉ॥ గం.7.05వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇంట బయట అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమ పడవలసి వస్తుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో అధికారుల నుండి పబ్లిక్ నుండి వత్తిడికి లోనుకాగలరు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. అనుకోని చిన్న ఆర్థిక సమస్యల వల్ల నలుగుతారు. షేర్లు కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఆర్థిక లావాదేవీలు వాయిదా పడటం మంచిది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలకు, కుటుంబ అవసరాలకు ఖర్చు అధికం కాగలదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, అనుమతులు ఆలస్యం అవుతాయి. క్రొత్త ప్రణాళికలు, ఆలోచనలతో ఆర్థికంగా బలపడటానికి ప్రయత్నాలు సాగుతాయి. వృత్తి జీవనంలో శ్రమ, అసంతృప్తి ఉంటుంది. వ్యాపార వర్గాలకు, ఉద్యోగులకు ఆదాయ వనరులు పెరిగి రాబడి పెరుగుతుంది. షేర్లపై స్వల్ప లాభాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయముండదు. అవకాశాలు మంచివి చేజారిపోగలవు. కోర్టు కేసులు, బాకీల చెల్లింపులు, బాకీల వసూలు వాయిదా పడతాయి. తొందరపాటు నిర్ణయాలు, సమాధానాల వల్ల ఇబ్బందులు పడతారు. బంధువర్గంతో విభేదాలు కలగడం, అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడటం, అవసరాలకు ఋణం చేయడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్యాలలో పాల్గొనడం ఆత్మీయులను బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. వ్యవహారాలలోను, సొంత పనులందును యధోచిత నిర్ణయాలు తీసుకొని, కార్యసాధకులు కాగలరు. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపార వర్గాలకు అభివృద్ధి ఆదాయము బాగుంటుంది. స్థిరాస్తుల కొనుగోలు అవకాశాలుండి ప్రయత్నాలు చేస్తారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వ కార్యాలయాలలో పనులు, అనుమతులు అనుకూలం కాగలవు. దూర ప్రయాణాలు ఖరారు కాగలవు. ఇంట బయట మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. వ్యాపారాలలో కొత్త పథకాలు, ప్రణాళికలతో అభివృద్ధి పరచుకొంటూ ఆదాయవృద్ధి చేసికొంటారు. భూములు స్థలాల క్రయ విక్రయాలు జరుగుతాయి. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారాలలో ఇబ్బందులు ఎదుర్కొని రాబడి పెంచుకొంటారు. వృత్తి జీవనంలో వున్న వారికి సంతృప్తి ఉండదు. ఉద్యోగార్థులకు ఉద్యోగావకాశాలు రావడానికి ఇంకా కొంత సమయమున్నది. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. విమర్శలకు నిందలకు అవకాశమివ్వకుండా నడుచుకొనండి. ప్రభుత్వం వద్ద పనులు ఆలస్యం కాగలవు. విద్యార్థులకు మంచి విద్యా ప్రగతి కలదు.

# మన నీళ్లు - మన మట్టితో రాజధాని

ప్రజా రాజధాని - అమరావతి నిర్మాణ సంకల్పంలో భాగంగా మన మట్టి - మన నీరు కార్యక్రమాన్ని అందరి భాగ స్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు పెన్నానది ఒడ్డున వున్న తిక్కన పార్కు వద్ద మన మట్టి - మన నీరు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, నగర మేయర్ సమన్వయంతో సర్వమత ప్రార్థనలతో నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మంత్రోచ్ఛా రణలు, మంగళవాయిద్యాలతో తిక్కన పార్కు ఈశాన్య ప్రాంతాన పసుపు సంచిలో మన మట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ రంగనాయకుల దేవాలయం వద్ద సాంప్రదాయ బద్ధంగా పెన్నానది నీరును రాగి పాత్రలో సేకరించారు.



ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ పివిఎస్ మూర్తి, ప్రజాప్రతినిధులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, శ్రీమతి అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, కార్పొరేటర్ రాజానాయుడు, దేవాదాయశాఖ కమిషనర్ రవీంద్రరెడ్డి, సంబంధిత అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.



# మాగుంట జన్మదిన వేడుకలు

శాసనమండలి సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నెల్లూరులోని కళ్యాణి ఫిలిమ్స్‌లో మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాగుంట శరత్‌చంద్రారెడ్డి, మాగుంట శీనయ్య చేత కేక్‌ను కట్ చేయించి తినిపించారు. ఈ వేడుకల్లో సమితి సభ్యులు సాయి, లేఖిన్‌రెడ్డి, మహేష్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి కబుర్లు

### 'మన కావలి'

# అభివృద్ధికి అండగా నిలవాలి

**- ఇన్‌ఛార్జి ఛైర్మెన్ భరత్‌కుమార్**




కావలి పట్టణంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం స్వచ్ఛభారత్ ముగింపు సభను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గత నెల 26వ తేదీ నుండి ఈనెల 10వ తేదీ వరకు పట్టణంలోని 40వార్డుల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను శుభ్రపరిచామన్నారు. అలాగే పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇకపై "మన కావలి" అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 15రోజుల పాటు పాల్గొన్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎవ్వరూ సెలవు పెట్టకుండా పని చేశారని అన్నారు. అందుకు అధికారులను, సిబ్బందిని, కార్మికులను అభినందించారు. ఇంతటితో ఈ కార్యక్రమం పూర్తి కాలేదని, ఈ పోరాటం 40వార్డులలో పూర్తిస్థాయిలో శుభ్రత ఏర్పడేవరకు సాగించాలన్నారు. అనంతరం కౌన్సిలర్లు రాజశేఖర్, జి.శ్రీదేవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎఎంసి డైరెక్టర్ చక్రపాణి, టిడిపి పట్టణ ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి సుబ్బారాయుడు గుప్తా, జి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎమ్‌లు సుబ్బారావు, జాఫర్‌ఖాన్‌లు ఉపన్యసించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, మున్సిపల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు.

# అమరా జన్మదిన వేడుకలు



కావలి పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి అమరా వేదగిరి సుబ్బారాయుడు గుప్తా జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక ఎవిఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, అమరా అభిమానులు, వర్తక, వ్యాపారస్తులు ఆయనను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. సప్తగిరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అమరా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ రాజకీయాలలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని తనదైన శైలిలో ముందుకు పోతున్నారన్నారు. అమరాకి తన వ్యక్తిగత విషయాల కంటే స్థానిక ప్రజల శ్రేయస్సే ఎక్కువగా చూస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆత్మకూరి బ్రహ్మయ్య, సుప్రీంకోర్టు న్యాయవాది పావని శివకుమార్, ఆర్.సుబ్బారావు, ఎఎంసి డైరెక్టర్ ఎస్.నారాయణ, వాణిజ్య విభాగం అధ్యక్షులు పి.నాగరాజు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాజధాని నిర్మాణంలో

# ప్రతి ఆంధ్రుడు భాగస్వామి కావాలి

**- టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి సంకల్పించారని, ఆ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఆంధ్రుడు భాగస్వామి కావాలని పట్టణ టిడిపి అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం 20, 24వార్డుల కౌన్సిలర్లు గుంటుపల్లి శ్రీదేవిచౌదరి, అనూరాధ నేతృత్వంలో ఆ వార్డుల ఇన్‌ఛార్జిలు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, పాలడుగు మురళీకృష్ణల ఆధ్వర్యంలో క్రిస్టియన్‌పేటలోని ఎస్‌టిబిటి చర్చి ప్రాంగణంలో క్రైస్తవ సాంప్రదాయం ప్రకారం రాజధాని నిర్మాణానికి మట్టి, నీరు సేకరించారు. చర్చి ఛైర్మెన్ ఎం.పాపయ్య, కార్యదర్శి విజయ్‌కుమార్ కమిటీ సభ్యుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణం సకాలంలో పూర్తి కావాలని, అందుకు తగిన ఆర్థిక, మనోధైర్యాన్ని ముఖ్యమంత్రికి కల్పించాలని ప్రభువును కోరారు. అలాగే మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో వెంగళరావునగర్ 25వ వార్డులోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రక్తదానానికి యువత ముందుకు రావాలి



దేశంలో పెరుగుతున్న రక్తదానం ఆవశ్యకతను దృష్టిలో వుంచుకుని 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, అందులో యువత ముందుండాలని రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యులు డాక్టర్ కె.మాధవరెడ్డి సూచించారు. బుధవారం నెల్లూరు ఎన్‌సిసి 24వ ఆంధ్ర బెటాలియన్ వారికి జెబి కళాశాలలో 5వ వార్షిక శిక్షణా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సిసిలో పలు అంశాలపై బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎ.కె.వర్మ హిందీలో మాట్లాడగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎబిపి మనోహర్ తెలుగులో అనువదించారు. అనంతరం డా॥ మాధవరెడ్డి మాట్లాడుతూ స్త్రీల ప్రసవ సమయంలో, ప్రమాదాలలో రక్తం అవసరమని అన్నారు. రక్తదానం చేయటం వలన ఎటువంటి హాని కలుగదని, పూర్తి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేనేజర్ వి.కె.మిశ్రా, ఎఎన్‌ఓలు మోహన్‌రావు, శ్రీనివాసులు, బాల బ్రహ్మచారి, పుల్లయ్య, మస్తాన్‌వలి, సీనియర్ ఎన్‌సిసి క్యాడెట్ ఐ.మణికంఠ, రెడ్‌క్రాస్ టెక్నీషియన్ ఎన్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# నిరాడంబరుడు అబ్దుల్ కలాం



భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త, 11వ భారత రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలాం 84వ జయంతి వేడుకలు పట్టణంలోని సాయి కో-ఆపరేటివ్ కళాశాలలో నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ గోసల గోపాలరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, అందుకు నిదర్శనం కలాంగారని తెలియజేశారు. నా పదవీ కాలంలో మేము ఎంతో సన్నిహితంగా ఉండేవారమని నేడు ఆయన మరణం దేశానికి తీరనిలోటని అన్నారు. తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించి పట్టుదలతో గొప్ప మహనీయుడైనారని అన్నారు. రాష్ట్రపతిగా ఉన్నా ఆయన సాధారణ జీవితాన్ని గడిపిన నిరాడంబరుడని కొనియాడారు. 2020 సంవత్సరం నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని, అందుకు కావలసిన ప్రణాళికలను తన ఇండియా 2020 పుస్తకంలో పొందుపరిచారని అన్నారు. కలాం ఒక శక్తి అని, భారతదేశం యొక్క మిసైల్ మాన్‌గా పిలవబడుతూ భారతరత్నతో పాటు అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్న గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మనాభరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు అనుమాలశెట్టి శివ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### నేతాజీ విద్యార్థికి

# కలరింగ్‌లో గోల్డ్‌మెడల్




ముంబాయి రంగోత్సవ్ సంస్థ వారు నిర్వహించిన జాతీయ స్థాయి కలరింగ్ అండ్ చేతివ్రాత పోటీల్లో నెల్లూరు శ్రీ నేతాజీ ఫైలట్ హైస్కూల్ విద్యార్థి ఎన్.లిఖిత్ ఆల్ ఇండియా ద్వితీయ బహుమతి, గోల్డ్‌మెడల్ సాధించినట్లు శ్రీ నేతాజీ ఫైలట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. డ్రాయింగ్‌లో మెరిట్, హ్యాండ్ రైటింగ్‌లో ఆల్ ఇండియా తృతీయ బహుమతిని 6వ తరగతి చదువుతున్న సిహెచ్ పల్లవి, ఎన్.కార్తిక్, సాయిలేఖన, మౌనిక, కలరింగ్ మెరిట్ అవార్డును పి.సుశాంత్, డి.యశశ్విని, పి.రూప, ఎం.శశాంక్‌లు సాధించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, శ్రీ నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటి అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ వాణి, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఆనీగ్రేస్, పిఇటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కదిలించని జగన్ దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఇక రాష్ట్రానికి ప్రత్యేకహోదాను కేంద్రంతో పోరాడైనా సాధించుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే అసలు పట్టనట్లే ఉన్నాడు. హోదా అపన సంజీవని కాదంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఆయన మనసంతా కూడా ప్రత్యేకహోదా కంటే కూడా ప్రత్యేక ప్యాకేజీ చుట్టే తిరుగుతుంది. కేంద్రం దిగొచ్చి హోదా ఇస్తామన్నా కూడా ఈయన వద్దనేటట్లున్నాడు. రాష్ట్రం ఇప్పుడున్న ఆర్థిక ఇబ్బందుల్లో ప్రత్యేకహోదా వస్తే పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో అభివృద్ధికి అవకాశముంటుంది. అయితే ప్రత్యేకహోదాను కేంద్రం ఇస్తాననడం లేదు. చంద్రబాబు ప్రయత్నమూ చేయడం లేదు.

ఈ దశలో దీక్షలు, ధర్నాలు అంటే ఎంతో ఉత్సాహంతో ముందుకొచ్చే వైసిపి అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేకహోదా రూపంలో ఒక అస్త్రం దొరికినట్లయ్యింది. ప్రత్యేకహోదా సాధన కోసం అంటూ గుంటూరులో ఆరురోజుల పాటు నిరాహారదీక్ష చేసాడు. ఆరో రోజు పోలీసులొచ్చి అరెస్టు చేసి ఆస్పత్రికి తరలించారు.

జగన్ నిరాహారదీక్ష వల్ల ఏమన్నా కదలిక వుందా? అంటే ఏమీ లేదు. జగన్ దీక్షపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవ్వంత కూడా చలించలేదు. ఎందుకంటే దగ్గర్లో ఎన్నికలు లేవనేదే వారి ధీమా. జగన్ దీక్ష కూడా ప్రజలపై పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇదొక పార్టీ కార్యక్రమంలాగా జరిగింది. ఏ ఉద్యమం అయినా ప్రజలు పాల్గొంటేనే వేడెక్కుతుంది. ప్రభుత్వాలు కదిలొచ్చేది కూడా అప్పుడే! కాని ఇప్పుడు పార్టీల పరంగా జరుగుతున్న ఉద్యమాలకు ప్రజలు దూరంగా వుంటున్నారు. వీళ్లు తమ రాజకీయ అవసరాల కోసం చేసుకుంటున్నారనే అభిప్రాయం ప్రజల్లో వస్తోంది. విభజన బిల్లును తెచ్చినప్పుడే ఆంధ్రాప్రజలు పెద్దగా స్పందించలేదు. కాబట్టి రాష్ట్ర విభజనను కేంద్రం సులభంగా చేసుకోగలిగింది. ఇప్పుడు ప్రత్యేకహోదా విషయంలో కూడా ప్రజల్లో స్పందన లేదు. జగన్ సొంత దీక్ష మాదిరిగా చూసారు. ప్రజల్లోనే ప్రత్యేకహోదా కావాలనే తపన లేనప్పుడు ఎవరెన్ని దీక్షలు చేసినా ఏం లాభముంటుంది.

# డీలర్లు ప'రేషన్'

(5వ పేజీ తరువాయి)

చక్కెర మిగిలిందనుకుందాం. మరుసటి నెలలో 6టన్నులు బియ్యం, అరటన్ను చక్కెరకు ఇండెంట్ పెట్టాలి. రికార్డుల ప్రకారం మిగిలిన సరుకును మరుసటి నెలలో సర్దుబాటు చేసుకుంటుండాలి. కాని జిల్లాలో చాలామంది డీలర్లు అలా చేయలేదు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఏ నెలకానెల మిగిలిన సరుకులను బ్లాక్‌లో అమ్ముకోసాగారు. కిలో రూపాయికిచ్చే బియ్యాన్ని వీళ్లు బయట 11రూపాయలుకే అమ్ముకునేవాళ్లు. చక్కెర కూడా అంతే. గతంలో కొంతవరకే సరుకు మిగిలేది. ఈపాస్ వచ్చాక భారీగా సరుకులు మిగలసాగాయి. దీనిని చూసి డీలర్లు భలే సంబరపడ్డారు. ఈపాస్ పెట్టింది తమ కోసమే అన్నట్లు ఆనందభరితులయ్యారు. కాని అసలు కథ ఇప్పుడే మొదలైంది. రేషన్ షాపుల మీద విజిలెన్స్ దాడులు మొదలయ్యాయి. మిగిలిపోయిన సరుకుల వివరాలు అడుగుతుంటే డీలర్ల వద్ద లేవు. కొందరు డీలర్లు సరుకులను బ్లాక్‌లో అమ్మారనేది క్లియర్‌గా అర్ధమవుతోంది. విజిలెన్స్ దాడులు జరుగుతుండడంతో కేసుల నుండి తప్పించుకునేందుకు మరికొందరు డీలర్లు మాత్రం తాము 11రూపాయల లెక్కన అమ్మిన బియ్యాన్నే తిరిగి మిల్లర్ల వద్ద నుండి 20 లేదా 30రూపాయలకు కొంటూ రిజిష్టర్ ప్రకారం స్టాక్ చూపిస్తున్నారు. చక్కెరను కూడా మార్కెట్‌లో ఎక్కువ రేటు పెట్టి కొని స్టాక్ పెడుతున్నారు. బ్లాక్‌లో సరుకులు అమ్మితే వచ్చిన ఆదాయానికి ఇప్పుడు సరుకులు కొని స్టాక్ పెట్టడానికి మూడింతలవుతోంది.

ఈపాస్ విధానం తమను ఈ విధంగా ముంచుతుందని వూహించలేదని డీలర్లు వాపోతున్నారు. అసలు ఈపాస్ వచ్చిందే రేషన్ సరుకులను దారి తప్పకుండా చేయడానికనే విషయం వీరికి ఆలస్యంగా అర్థమైనట్లుంది.

# జగజ్జననీ... కరుణించమ్మా

- శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకారాలు
- భక్తులతో కిటకిటలాడుతున్న దేవస్థానాలు

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నెల్లూరు నగరంలోని అమ్మవారి దేవస్థానాల్లో ఈ నెల 13వ తేదీ కలశస్థాపనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని వివిధ అలంకారాలలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవశోభతో అమ్మవారి ఆలయాలు కళకళలాడుతున్నాయి.

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 13వ తేదీ అమ్మవారు చండీ అలంకారంలోను, 14వ తేదీ భవానీ అలంకారణంలోను, 15వ తేదీ గాయత్రి అలంకారంలోనూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణ శర్మ పర్యవేక్షణలో రఘురామ్మూర్తి స్వామి, సంజీవరావు స్వామి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సంపుటీకరణ చండీహోమాన్ని నిర్వహించారు. మహిళాభక్తులు అధికసంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేసి నోములు నోచుకున్నారు. ఆలయ శాశ్వత ధర్మకర్త రత్నం జయరాం, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కోదండరామిరెడ్డిలు పర్యవేక్షించారు. ప్రతిరోజూ జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నెల్లూరు శివారు ప్రాంతంలోని సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 13వ తేదీ రాజరాజేశ్వరి అలంకారంలోను 14వ తేదీ అన్నపూర్ణ అలంకారంలోను, 15వ తేదీ గజలక్ష్మి అలంకారంలోను భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చండీయాగం, సాయంత్రం సామూహిక కుంకుమ



పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొని పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వి.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 13వ తేదీ కలశస్థాపన కనుల విందుగా జరిగింది. 14వ తేదీ బాలత్రిపుర సుందరి అలంకారంలోను, 15వ తేదీ అన్నపూర్ణ అలంకారంలోను భక్తులకు దర్శనమిచ్చారు. పూలంగిసేవ కనువిందు చేసింది. ఆలయంలో అమ్మవారికి శ్రీవాసవి అష్టోత్తరం, సహస్రనామార్చన, దేవీ ఖడ్గమాల, దేవీ నవావరణ పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు, కోశాధికారి వాయుగుండ్ల సాయిసువర్ణ, పాలకమండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



అలాగే నెల్లూరులోని పలు ఆలయాల్లో ఉత్సవాలు కనువిందుగా జరుగుతున్నాయి. సుజాతమ్మ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో, సంతపేట కంసాలి వీధిలోని శ్రీ భ్రమరాంబ సమేత హరనాథస్వామి దేవస్థానంలో, బాలాజీనగర్ సీతారామమందిరంలో సీతాదేవి అమ్మవారికి, విరాట్‌నగర్‌లోని శ్రీ గాయత్రిదేవి గోవింద మాల సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో, నెల్లూరు నగరంలోని అన్ని మహాలక్ష్మమ్మవారి దేవస్థానాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవార్లకు విశేషపూజలు, అభిషేకాలు, కుంకుమపూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

# అధికారులపై దౌర్జన్యం దురదృష్టకరం

నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన అధికారులపై అక్కడున్న వ్యాపారస్తులు, అనధికార వ్యాపారులు, వారు నియమించుకున్న ప్రైవేట్ వ్యక్తులు కలిసి దౌర్జన్యం చేసి నిర్బంధించడం దురదృష్టకరమని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్యచౌదరి విమర్శించారు. తూకాల్లో మోసం జరుగుతుందని ప్రశ్నిస్తే అక్కడి వ్యాపారస్తులు ఉమ్మడిగా గొడవలకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అనధికార అంగళ్లను తొలగించి ధర్మకాటా సక్రమంగా పనిచేసేటట్లు చేసి దానిని పూర్తిగా వినియోగించుకొనే విధంగా వ్యాపారులకు ఖచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబురావు, రసూల్, రామానాయుడు, రమేష్‌బాబు, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పది జిల్లాలపై పగబట్టారా?

(మొదటి పేజీ తరువాయి)

బాధపడాల్సి వచ్చేది కాదు. అభివృద్ధినంతా కూడా హైదరాబాద్‌లోనే కేంద్రీకరించడం వల్ల విభజనప్పుడు బాధపడాల్సి వచ్చింది. హైదరాబాద్ నేర్పిన అనుభవంతో కొత్త రాజధాని నిర్మాణంలోనైనా జాగ్రత్తలు తీసుకోవాలని, అభివృద్ధినంతా ఒకే చోట కేంద్రీకరించకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చూడాలని, అభివృద్ధిలో అసమానతలు వస్తే మళ్లీ విభజనోద్యమాలకు బాటలు వేసినట్లేనని మేధావులు చంద్రబాబు ప్రభుత్వానికి ఏనాడో సూచించారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ వంటి రాజకీయ విజ్ఞులు రాష్ట్ర ప్రజలకు కావాల్సింది సింగపూర్ లాంటి రాజధాని కాదని, తాముంటున్న ప్రాంతాలు అభివృద్ధి చెందడమేనని చెబుతూ వచ్చారు.

అయితే ఇవేవీ చంద్రబాబు తలకెక్కలేదు. సింగపూర్ లాంటి అమరావతి రాజధాని మాత్రమే ఆయన మైండ్‌లో ఫిక్సయిపోయింది. హైదరాబాద్ విషయంలో గత ఆంధ్రా ముఖ్యమంత్రులు ఏ తప్పయితే చేసారో, ఇప్పుడు చంద్రబాబు దానిని పునరావృతం చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 13జిల్లాలుండగా, అభివృద్ధి విషయంలో చంద్రబాబు దృష్టింతా కూడా కేవలం మూడు జిల్లాల మీదే వుంది. మిగతా 10జిల్లాలు నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధినంతా కూడా గుంటూరు, కృష్ణ, విశాఖ జిల్లాలకే పరిమితం చేస్తుంది. రాష్ట్రంలో కొద్దో గొప్పో అభివృద్ధి చెందిన జిల్లాలివే. సారవంతమైన భూములు, సమృద్ధిగా నీటి వనరులు, వ్యాపార, వాణిజ్యాలు వున్న జిల్లాలివి. ప్రత్యేకంగా ఈ జిల్లాల మీద దృష్టి పెట్టాల్సిన పని లేదు. కాని చంద్రబాబు పట్టుబట్టి అమరావతి రాజధాని ఇక్కడే పెట్టాడు. ఎయిమ్స్ వంటి పెద్ద జాతీయ సంస్థలను ఇక్కడే మంజూరు చేయించాడు. రాజధాని మూలంగా గుంటూరు, కృష్ణా జిల్లాలు మాత్రమే ఇతరత్రా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతాయి. ఇక వీటి తర్వాత విద్య, ఐటి, పర్యాటక, పరిశ్రమల పరంగా విశాఖ జిల్లాకు ప్రాధాన్యత నిస్తున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరంగా అధిక ప్రాధాన్యతనివ్వాల్సినవి శ్రీకాకుళం, విజయనగరం, కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం, నెల్లూరుజిల్లాలు. ఉభయ గోదావరి జిల్లాలు ప్రభుత్వం పట్టించుకోకపోయినా ఇబ్బంది లేదు. చిత్తూరు జిల్లా రాయలసీమలో వున్న మిగతా జిల్లాలతో పోలిస్తే కొంత నయం. అనంతపురం, కడప, ప్రకాశం, నెల్లూరుజిల్లాలలో కరువు ఎక్కువ. వ్యవసాయేతర రంగాలో వీటిని అభివృద్ధి చేయాల్సి వుంది. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని విభజన బిల్లులో ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. చంద్రబాబు సర్కార్ ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలను కేవలం మూడు జిల్లాలకే పరిమితం చేస్తూ, థర్మల్ విద్యుత్, అణు విద్యుత్ వంటి ప్రమాదకర ప్రాజెక్టులను మాత్రం మిగతా జిల్లాలకు కేటాయిస్తోంది. అభివృద్ధినంతా ఒకే చోట కేంద్రీకరిస్తున్నారంటూ రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రజిల్లాల ప్రజలు అప్పుడే ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు పోకడలు ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్‌లో మరో విభజన ఉద్యమం తలెత్తడానికి ఖచ్చితంగా అవకాశమిచ్చినట్లే!

## • నెల్లూరు వైద్యుడి అద్భుత ప్రతిభ

### శస్త్ర చికిత్స ద్వారా వారాల బిడ్డకు ద్వారాలు తెరచి

# ప్రాణం పోశారు

### ముక్కు రంధ్రాలు మూసుకుపోయిన శిశువుకి "నాసల్ ఎండోస్కోపి ద్వారా వూపిరి"





***పూర్తిగా నెలలు నిండకుండానే జన్మించి, శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఓ శిశువుకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రి వైద్యులు ఇటీవల అత్యద్భుతంగా శస్త్రచికిత్స నిర్వహించి, ఆ చిన్నారికి స్వస్థత చేకూర్చారు.***

ఎంతో అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవంతం చేయడంలో ప్రసిద్ధిగాంచిన కేర్ ఆసుపత్రి వైద్యుల ప్రతిభ సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. ఈ ఆసుపత్రిలోని ప్రముఖ ఇఎన్‌టి వైద్యనిపుణులు, ప్లాస్టిక్ సర్జన్, మన నెల్లూరీయుడు డాక్టర్ ఎన్.విష్ణు స్వరూప్‌రెడ్డి ఆ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఫాతిమా అనే మహిళ 33 వారాల్లోనే ఓ శిశువుకు జన్మనిచ్చింది. అయితే, పుట్టినప్పటినుంచి ముక్కువెనుక రంధ్రాలు మూసుకుపోయాయి. దీంతో ఆ శిశువుకు ఊపిరి పీల్చుకోవడంలో సమస్యలు రావడంతో ఆ తల్లి తన బిడ్డకు ఏమవుతుందోనని శోకసాగరంలో మునిగిపోయింది. అయితే, డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి నాయకత్వంలోని వైద్యుల బృందం ఆమెకు ధైర్యం చెప్పి, ఆ చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆ శిశువుకు ముక్కులోపల రంధ్రాలు వుండాల్సినచోట ఎముక అడ్డంగా వుండడంతో శ్వాస పీల్చుకోవడం కష్టతరమైంది. శ్వాస నాళాల్లో ఎంతో అరుదుగా వచ్చే 'బైలాట్రల్ కోవనల్ ఆర్టీసియా' అనే సమస్యతో శిశువు బాధపడుతోందని, ఇది ఏ ఏడు వేలమందిలోనో ఒకరికి ఇలా అరుదుగా వస్తుంటుందని గ్రహించారు. అసలే, చిన్ని శిశువు. చేతిలో ఇమిడిపోయే పరిమాణంతో వున్న ఆ శిశువుకు ముక్కులో శస్త్రచికిత్స చేయడం ఎంతో కష్టసాధ్యం. ఈ సమస్యనుంచి చిన్నారిని రక్షించేందుకు ఎంతో అరుదైనదే కాకుండా అత్యంత కష్టతరమైన నాసల్ ఎండోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. ఎంతో సున్నితమైన ప్రత్యేక పరికరాలను ఉపయోగించి, ముక్కు రంధ్రాల స్థానంలో అడ్డంగా వున్న ఎముకను తొలగించేందుకు శస్త్ర చికిత్స చేశారు. ఎట్టకేలకు చివరికి కృత్రిమంగా శ్వాస నాళాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ శిశువుకు వున్న సమస్యను తొలగించారు. ఇలాంటి అరుదైన సర్జరీని విజయవంతంగా నిర్వహించిన కేర్ వైద్యబృందం అందరి ప్రశంసలు అందుకుంటోంది. అందులోనూ, మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతోనే ఈ శస్త్రచికిత్సను పూర్తిచేశామని డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి పేర్కొన్నారు. నాసల్ ఎండోస్కోపీ పద్ధతిలో శ్వాసనాళానికి అడ్డుగా వున్న ఎముకకు రంధ్రం చేసి, మూసుకుపోయిన నాళాలను తెరిచామని, తాత్కాలికంగా ఓరల్ ఎయిర్ వేస్ లైఫ్ సేవింగ్స్ పైప్స్‌ను ఏర్పాటు చేశామని, వాటిని ఆరు వారాల తర్వాత తొలగిస్తామని ఆయన తెలిపారు. ఆ శిశువు ఇప్పుడు ముక్కురంధ్రాల ద్వారా హాయిగా శ్వాస తీసుకుంటోందని, శస్త్ర చికిత్స పూర్తిగా విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు.

***సహజంగా తల్లి గర్భంలో పిండం ఏర్పడినప్పటి నుండి 40వారాల అనంతరం జన్మిస్తుంది. అయితే ఈ బిడ్డ హైదరాబాద్ నగరానికి చెందిన షరీఫ్ ఫాతిమా అనే మహిళకు 33 వారాలకే అంటే 7వారాల ముందే ఇలాంటి అరుదైన లోపంతో జన్మించింది. గతంలో రెండు సార్లు గర్భంలోని బిడ్డలను పోగొట్టుకున్న ఈ చిన్నారి తల్లిదండ్రులకు 33వారాలకే శ్వాస తీసుకునే అవకాశం లేకుండా జన్మించిన ఈ బిడ్డ తమకు శాపమేమో అనుకుంటున్న తరుణంలో వారికి ఆశలు కల్పించి భూమిపై పడిన 7రోజులకే ప్రపంచంలోనే అత్యంత కష్ట మైన శస్త్ర చికిత్సను డా॥ విష్ణుస్వరూప్‌రెడ్డి నేతృత్వంలోని డాక్టర్లు నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు.***

ప్రపంచంలోనే ఇలాంటి ఆపరేషన్ అరుదైనదని, అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ శస్త్ర చికిత్స చేశామని డా॥ విష్ణు అన్నారు. ఈ శస్త్రచికిత్సలో సహకరించిన వైద్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

డా॥ విష్ణుది నెల్లూరు. పేరుగాంచిన విద్యావేత్తగా ప్రసిద్ధి చెందిన మైపాడు వాస్తవ్యుడు నారపరెడ్డి కోదండరామిరెడ్డికి విష్ణు పెద్దకుమారుడు. ఇఎన్‌టి నిపుణుడిగా ఇప్పటికే ఎన్నో సంచలనాలకు సారధిగా నిలిచిన విష్ణుస్వరూప్ ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేసి ప్రపంచ స్థాయిలో వైద్య రంగాన్ని ఆకట్టుకున్నాడు. నెల్లూరీయులు ఏ రంగంలో వున్నా తమదైన ప్రతిభను ప్రదర్శిస్తారనడానికి ఈ శస్త్ర చికిత్స మరో ఉదాహరణ. నెలలు కూడా నిండని పసిగుడ్డుకి అతికష్టమైన ఆపరేషన్ చేసి ఊపిరిపోశాడు విష్ణు. ఈ పసిగుడ్డు అమ్మానాన్నల దృష్టిలో దైవంలా నిలిచిన విష్ణుస్వరూప్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# నెల్లూరులో డయాబిటిస్ & ఎండోక్రైన్ క్లినిక్





నెల్లూరులో డయాబిటిస్ డాక్టర్ ఎవరంటే ముందుగా గుర్తొచ్చేది డాక్టర్ సత్యనారాయణమూర్తి. నెల్లూరు పొగతోటలో ఎన్నో ఏళ్ల క్రితమే డయాబిటిస్ క్లినిక్‌ను నెలకొల్పి షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆయన మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పుడు మరో ముందడుగు వేసారు. డయాబిటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్‌ను ఈ నెల 22వ తేదీన విజయదశమి నాడు ప్రారంభిస్తున్నారు. సత్యనారాయణమూర్తి అల్లుడు డాక్టర్ ఎం.వి.రామమోహన్ కూడా ఈ క్లినిక్ ద్వారా తమ వైద్యసేవలు అందించనున్నారు. ఈయన డయాబిటిస్‌తో పాటు ఎండోక్రైనాలజీ స్పెషలిస్ట్. గతంలో అపోలో వంటి ఆసుపత్రిలో పనిచేసి విశేష అనుభవం గడించారు. షుగర్, హార్మోన్స్, థైరాయిడ్, ఒబెసిటి, బరువు తగ్గడం, నెలవారీ సమస్యలు, పిట్యూటరి సమస్యలు, హైబిపి వంటి వాటికి సరైన చికిత్సనందించడంలో సిద్ధహస్తులు. నగరంలో కార్పొరేట్ ఆసుపత్రులలో తప్పితే బయట ఎండోక్రైనాలజీ వైద్యులు పెద్దగా లేరు. డయాబిటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్ ద్వారా ఆ సమస్య తీరబోతోంది.

### దీక్ష భగ్నంపై..

# కాగడాలతో నిరసన





ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం వైయస్సార్సీపీ అధినేత వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరులో చేపట్టిన దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు కాగడాలు, కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, నగర అధికార ప్రతినిధి గుండాల మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక అధికారపార్టీ నేతలు పోలీసులతో దీక్షను భగ్నం చేయడం సిగ్గు చేటన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుండి మాగుంట విగ్రహం సెంటర్ వరకు ప్రదర్శనగా వెళ్లి మానవహారం చేపట్టారు. కార్పొరేటర్లు కాకుటూరు లక్ష్మీసునంద, యాకసిరి ప్రశాంత్ కిరణ్, బత్తిన శోభన్‌రెడ్డి, వేమిరెడ్డి హరిశివారెడ్డి, తాళ్లూరు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన రాజధానిని చూస్తాం!



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచమే ఆశ్చర్యపోయే అద్భుత రాజధానిని కట్టబోతున్నామని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సేకరిస్తున్న 'మన మట్టి – మన నీరు' కార్యక్రమాన్ని ఈ నెల 14న ఆయన తన సొంతూరైన అల్లీపురంలోని శ్రీరామ మందిరంలో నిర్వహించారు. రాజధానికి పంపించే మట్టి, నీళ్లకు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తెలుగుదేశం నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, కిలారి వెంకటస్వామినాయుడు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, కె.తిరుమల నాయుడు, మేకల రామ్మూర్తి, పి.శైలజా, రాజానాయుడు, పెంచలయ్య, ఎం.వెంకయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com